ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 28 ఏప్రిల్ 2024

సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో జయచంద్రారెడ్డి



పెద్దిరెడ్డి కుటుంబాన్ని గెలిపిస్తే
మీ పని గోవిందా..

- ప్రాజెక్టు పనులతో రూ.2 వేల కోట్లు కొట్టేయాలని చూశారు
- ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 27: పెద్దిరెడ్డి కుటుంబాన్ని మళ్లీ ఇక్కడ గెలిపించారంటే మీ పని గోవిందా అని రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ములకలచెరువులోని కేజీఎస్ కల్యాణమండపంలో శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆవులపల్లె, నేతికుంటపల్లి, ముదివేడు ప్రాజెక్టులను కేంద్ర అనుమతులు లేకుండా, తప్పుడు లెక్కలు ఇచ్చి ఇష్టానుసారంగా పనులు చేపట్టి రూ.2 వేల కోట్లు కొట్టేయాలని చూశారన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పాడి, మామిడి రైతులను పెద్దిరెడ్డి కుటుంబం దోచుకుంటోందన్నారు. ఎంపీగా పోటీ చేస్తున్న తనకు పువ్వు, ఎమ్మెల్యేకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించి అరాచక పాలనకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. తంబళ్లపల్లె అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మాట్లాడారు.

ఇద్దరు వలంటీర్లు తొలగింపు : ఎంపీడీవో

సుండుపల్లె, ఏప్రిల్ 27: ఎన్నికల కమిషన్ ఆదేశాలు ధిక్కరించి వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్‌లను తొలగించినట్లు శనివారం ఎంపీడీవో అమర్‌నాథ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవద్దని కోర్టు ఆదేశించినా గుండ్లపల్లి గ్రామ పంచాయతీ, చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన వలంటీర్‌లు ప్రచారంలో పాల్గొనడంతో వారిని తొలగించినట్లు తెలిపారు. వలంటీర్లు ఎవరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించవద్దని ఎంపీడీవో పేర్కొన్నారు. గుండ్లపల్లె గ్రామ పంచాయతీకి చెందిన అంజలి, చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీకి చెందిన రవికుమార్‌నాయుడులను తొలగించినట్లు తెలిపారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పెంచండి

- డ్వామా పీడీ మద్దిలేటి


రామాపురం, ఏప్రిల్ 27: ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యత పెంచే విధంగా చూడాలని డ్వామా పీడీ మద్దిలేటి ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలోని నల్లగుట్టపల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీల మస్టర్‌లను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ రోజుకు కూలి ఎంత పడుతుంది అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఉపాధి పనులు చేస్తే మనిషికి కూలి రూ.300 వచ్చే విధంగా పనిచేయాలన్నారు. మండల వ్యాప్తంగా కూలీలు ఎంత మంది ఉపాధి పనిచేస్తున్నారని సిబ్బందిని అడగ్గా 5260 మంది పనులు చేస్తున్నారని ఫీల్డ్ సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పనులు కావాల్సిన వారికి వెంటనే పనులు కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈసీ శ్రీకాంత్‌రెడ్డి, టీఎఫ్‌టీ బాబు, ఫీల్డ్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

నేడు ఏపీసెట్



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 27: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజబులిటీ టెస్ట్ (ఏపీ సెట్) 2024 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వైవీయూ ప్రొఫెసరు, ఏపీ సెట్ ప్రాంతీయ సమన్వయకర్త షావల్లిఖాన్ తెలిపారు. అసిస్టెంటు ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్, పీహెచ్‌డీ పోస్టుల్లో ప్రవేశాలకు అర్హత నిర్ణయంచే ఏపీ సెట్‌ను ఈనెల 28న కడప నగరంలో 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు 2500 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వైవీయూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫర్ మెన్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, నాగార్జున డిగ్రీ అండ్ పీజీ, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ, శ్రీహరి డిగ్రీ అండ్ పీజీ, విద్యాసాధన డిగ్రీ కళాశాలలను కేంద్రాలుగా నిర్ణయించామన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభ సమయానికంటే గంట ముందే హాజరు కావాలన్నారు. నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డు వెంట తీసుకురావాలన్నారు.

పీలేరు మండలం గూడరేవుపల్లె గంగమ్మ గుట్టలో గుట్టను చదును చేస్తున్న జేసీబీలు (ఫైల్)



గుర్రంకొండ మార్కెట్ యార్డు సమీపంలో మట్టి కోసం గుట్టను తవ్వుతున్న మట్టి మాఫియా(ఫైల్)



కొండలు.. గుట్టలు గుల్ల..

- రెచ్చిపోయిన అధికార పార్టీ మట్టి మాఫియా
- చోద్యం చూసిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- ముందుగా అక్రమ తవ్వకాలు, ఆపై ఆక్రమణలు
- పీలేరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా కొండలు, గుట్టల తవ్వకాలు
- పెద్దిరెడ్డీ.. మీ హామీ ఏమైందో..



వాల్మీకిపురం సమీపంలో మట్టి తవ్వకాలతో కరిగిపోయిన నూరు కుప్పల కొండ

పీలేరు/వాల్మీకిపురం/కలకడ/గుర్రంకొండ, ఏప్రిల్ 27: "గత ప్రభుత్వ హయాంలో పీలేరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ముసుగులో అధికార పార్టీ నేతలు ఎక్కడ చూసినా కొండలు, గుట్టలు యథేచ్ఛగా తవ్వేశారని, తాను పీలేరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంతో అందంగా ఉన్న పీలేరు పట్టణం కళావిహీనంగా కనిపిస్తోందని, తమ పార్టీ అధికారంలోకి వస్తే కొండలు, గుట్టలు కాపాడడమే కాకుండా ప్రకృతి సహజ సౌందర్యాన్ని పరిరక్షిస్తామని 2019 ఎన్నికల సందర్భంగా పీలేరులో జరిగిన ప్రచార సభలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్న మాటలివి."

అప్పట్లో పెద్దిరెడ్డి మాటలు విన్న చాలా మంది పీలేరు ప్రాంత ప్రజలు అవి నిజమవుతాయని ఆశించారు. ఆయన చెప్పినట్లుగానే ఆయన పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన ఆయన పార్టీ నాయకులే కొండలు, గుట్టల రక్షకులుగా ఉండాల్సిందిపోయి భక్షకులుగా మారిపోయారు. పీలేరు ప్రాంతంలో నిత్యం ఎంతో డిమాండ్ ఉండే రియల్ ఎస్టేట్ వెంచర్ల అభివృద్ధి పనుల ఏజెంట్లుగా మారి మైనింగ్ మాఫియాగా మారిపోయారు. రియల్టర్లతో బేరం మాట్లాడుకుని ఎటువంటి అనుమతులు లేకుండా తమకిష్టమొచ్చిన గుట్టను, కొండను ఎంపిక చేసుకుని దానిని యథేచ్ఛగా కొల్లగొట్టారు. తమ గ్రామ పరిధిలోని కొండలు, గుట్టలు చదును చేసి కోట్లు సంపాదిస్తున్న వారిని చూసి చాలా మంది గ్రామస్థాయి నాయకులు జట్టుగా ఏర్పడి తామే స్వయంగా రియల్టర్లతో ఒప్పందాలు చేసుకునే స్థాయికి ఎదిగారు. దీంతో పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో ఐదేళ్లుగా ఏ మారుమూల ప్రాంతంలో చూసినా రేయి పగలు తేడా లేకుండా హిటాచీలు, జేసీబీలు ఎడతెరపి లేకుండా పనిచేశాయి.

కొండలు, గుట్టలను కాపాడాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తూ ఉండిపోయారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవులు పీలేరులో ఉండడంతో వీరు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. దీంతో అటు పశువులకు మేత భూములుగా, సహజ సరిహద్దులుగా ఉండాల్సిన అనేక కొండలు, గుట్టలు నేడు పీలేరు నియోజకవర్గంలో కనిపించకుండా పోయాయి. పీలేరులో ప్రకృతి సౌందర్యాన్ని కాపాడుతానని హామీ ఇచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన చేతుల్లో మైనింగ్ శాఖ ఉన్నప్పటికీ ఎందుకనో ఎవరి మీదా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

అక్రమార్జన మార్గంగా మట్టి తవ్వకాలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పీలేరు ఒకటి. పీలేరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, చింతపర్తి వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం బాగా అభివృద్ధి చెందింది. ఆ ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక చోట రియల్ ఎస్టేట్ వెంచర్ వెలుస్తుంటుంది.

ఆ వెంచర్‌ను సుందరంగా అభివృద్ధి చేసేందుకు పెద్దఎత్తున మట్టి అవసరమవుతుంటుంది. ఆ మట్టి కోసం రియల్టర్లు స్థానికంగా ఉండే ట్రాక్టర్ల యజమానులను సంప్రదించేవారు. వారు స్థానిక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని ఆయా పంచాయతీలకు అంతో ఇంతో రుసుం చెల్లించి మట్టి తోలుకునేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీలోని చాలా మంది అగ్రనాయకులు రియల్టర్ల అవతారం ఎత్తారు. వారే స్వయంగా వెంచర్లు వేయడం, వాటికి కావాల్సిన మట్టి కోసం తమ అనుచరులతో తమకు అనుకూలమైన ప్రాంతాల్లో కొండలు, గుట్టలు, వాగులు, వంకలు తవ్వడం ప్రారంభించారు. అధికార పార్టీ నాయకులు కావడంతో ప్రభుత్వ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించారు. కాలక్రమంలో రియల్ ఎస్టేట్ బాగా అభివృద్ధి చెందడం, వైసీపీ నాయకులు డీకేటీ, ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని వాటిలో వెంచర్లు వేయడం ప్రారంభించడంతో మట్టికి మరింత డిమాండ్ పెరిగింది.

ఈ డిమాండ్‌ను అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకుల దగ్గర నుంచి మండల స్థాయి నాయకుల వరకు సొమ్ము చేసుకున్నారు. డిమాండ్‌ను బట్టి టిప్పర్ మట్టిని రూ.3 వేల నుంచి రూ.5 వేల దాకా విక్రయించి ఐదేళ్లలో వందల కోట్లు వెనకేసుకున్నారు. రేయి పగలే తేడా లేకుండా హిటాచీలు, జేసీబీలతో కొండలు, గుట్టలను యథేచ్ఛగా కొల్లగొట్టారు. వారి ధాటికి ప్రస్తుతం పీలేరు నియోజకవర్గంలోని ఏ మూల చూసినా కరిగిపోయిన కొండలే దర్శనమిస్తున్నాయి. చిన్న చిన్న గుట్టలైతే ఆనవాళ్లే లేనంతగా కనుమరుగైపోయాయి.

తొలుత తవ్వకాలు.. అనంతరం ఆక్రమణలు

కొండలు, గుట్టలను చదును చేసి అక్రమ మట్టి తవ్వకాల ద్వారా అంతో ఇంతో సంపాదించుకున్న అధికార పార్టీ నాయకులు ఆ తరువాత కూడా వాటిని కూడా వదిలిపెట్టలేదు. తాము మట్టి తవ్వుకున్న తరువాత ఆయా కొండలు, గుట్టల్లో చదునుగా మారిన ప్రాంతాన్ని సైతం ఆక్రమించుకున్నారు. తమ గ్రామ సమీపంలో చదును భూమి ఉందని, అందులో తమ వాళ్లకు జగనన్న ఇళ్లు నిర్మించుకుంటామని అటు అగ్రనాయకులు, ఇటు అధికారులను నమ్మించి తమకు కావాల్సిన వారి పేరిట పట్టాలు పొందారు. కొంతమంది అటువంటి భూముల్లో స్వయంగా వ్యవసాయం చేస్తుండగా అత్యధికులు తమ అనుచరులు, గ్రామస్తులకు కాలనీ ఇళ్ల కోసం అమ్మేసుకున్నారు.

పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ కుమ్మరపల్లె వద్ద ఉన్న గుట్టలో ఏడాది క్రితం రాయచోటి, పీలేరు పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకులు సంయుక్తంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. ఒకటి కాదు, రెండు కాదు...ఏకంగా నాలుగు హిటాచీలు, నాలుగు జేసీబీలు పెట్టి సుమారు నెల రోజులపాటు మట్టిని తవ్వుకున్నారంటే నియోజకవర్గంలోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గ్రామస్థులు అడ్డుచెప్పినా, పక్క పొలాల వారు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోకుండా వారు సుమారు రూ.2 కోట్ల విలువజేసే మట్టిని స్వప్రయోజనాలు (రియల్ ఎస్టేట్ వెంచర్) కోసం తరలించుకుపోయారు. పాపం....వైసీపీకే చెందిన ఆ గ్రామ సర్పంచ్ అభ్యంతరం చెప్పినా వారు వినిపించుకోలేదు సరికదా...అతడికి అగ్రనాయకుల ద్వారా ఫోన్లు చేయించినట్లు అప్పట్లో పుకార్లు షికార్లు చేశాయి.



పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ కుమ్మరపల్లె సమీపంలోని గుట్టలో పనిచేస్తున్న జేసీబీలు (ఫైల్)



కలకడ మండలం బాటవారిపల్లె రేకులకుంటలో మట్టి తవ్వకాలు

టీడీపీ ప్రచార రథం దహనం

- ప్రత్యర్థుల దాష్టీకమంటూ టీడీపీ శ్రేణుల ఆందోళన
- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- జాతీయ రహదారిపై తనూజారెడ్డి ఆందోళన
- కిలోమీటర్ల కొద్దీ నిలిచిపోయిన వాహనాలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 27: వాల్మీకిపురం మండలం విఠలం గ్రామ సమీపంలో శనివారం ఉదయం 8.15 గంటలకు టీడీపీ ప్రచార వాహనానికి గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో వాహనం పూర్తిగా దగ్ధమవడంతో పాటు వాహన డ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తరఫున ఆయన సతీమణి తనూజారెడ్డి వాల్మీకిపురం పట్టణంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఆమె ప్రచారానికి పట్టణంలో అనూహ్య స్పందన లభించింది. రెండో రోజు శనివారం ఉదయాన్నే తనూజా రెడ్డి పట్టణంలో ప్రచారం చేపట్టారు. మదనపల్లెకు చెందిన బాబాచారి అలియాస్ రాజు అనే వ్యక్తి తన బావమరిదికి చెందిన వాహనాన్ని టీడీపీ ప్రచార రథంగా మార్చి మండలంలో తిప్పుతున్నాడు. శనివారం కూడా యథాప్రకారం వాహనాన్ని వాల్మీకిపురం పట్టణం మీదుగా చింతపర్తి వైపు బయలుదేరాడు. విఠలం సమీపంలో నెంబరు లేని ద్విచక్ర వాహనంలో వెంబడిస్తూ వచ్చిన ఇద్దరు ఆగంతకులు వాహనాన్ని ఆపి తమతో పాటు తెచ్చిన ప్లాస్టిక్ కవర్‌లోని పెట్రోలును డ్రైవరు బాబాచారిపై కుమ్మరించి నిప్పు పెట్టి పారిపోయారు. అప్రమత్తమైన బాబాచారి వాహనం నుంచి దిగి పరుగులు తీశాడు. అప్పటికే బాబాచారి శరీరం కాలడంతో పాటు వాహనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే బాబాచారిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రచార రథం కాలిపోవడంతో పాటు బాబాచారి ఫోను కూడా అందులోనే దగ్ధమైంది.



దగ్ధమైన ప్రచార రథం వద్ద టీడీపీ శ్రేణులు



విషయం తెలిసిన తనూజా రెడ్డి టీడీపీ శ్రేణులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ ప్రచార వాహనానికి నిప్పు పెట్టడాన్ని జీర్ణించుకోలేక తనూజా రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వెంటనే అక్కడే జాతీయ రహదారిపై బైఠాయించి నిరసనకు ఉపక్రమించారు. మిగిలిన వందలాది పార్టీ శ్రేణులు సైతం ఆమెను అనుసరించి ఆందోళనకు దిగారు. దీంతో కిలోమీటర్ల కొద్దీ ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిల్చిపోయాయి. సమాచారం అందుకున్న సీఐ పులి శేఖ ర్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. ఈ దశలో తనూజా రెడ్డి కల్పించుకుని పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గానికి కారకులైన వారిని పట్టుకునేంత వరకూ రోడ్డుపై నుంచి లేచేది లేదని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. దాష్టీకానికి పాల్పడ్డవారు ఎవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిని పట్టుకుని శిక్షిస్తామని సీఐ నచ్చచెప్పడంతో తనూజారెడ్డి చివరికి ఆందోళన విరమించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డిలతో పాటు భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు.

డ్రైవరు బాబాచారిని పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా వుండాలని, అన్నింటికీ అండగా ఉంటామని హామీ ఇచ్చి ఓదార్చారు.

డీఎస్పీ విచారణ

వాల్మీకిపురంలో టీడీపీ ప్రచారం రథాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు చల్లి దహనం చేసిన సంఘటనలో శనివారం మధ్యాహ్నం రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా విచారణ చేపట్టారు. వాహనాన్ని ఆయన పరిశీలించి వివిధ కోణాల్లో సంఘటనల పూర్వాపరాలను ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రచార రథం డ్రైవర్ బాబాచారి అలియాస్ రాజును సంఘటన గురించి వివరాలు సేకరించారు. డ్రైవరు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సీఐ శేఖర్ మాట్లాడుతూ హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



జాతీయ రహదారిపై సీఐ శేఖర్‌తో వాగ్వాదానికి దిగిన నల్లారి తనూజా రెడ్డి, టీడీపీ శ్రేణులు

ఓటమి భయంతోనే పిరికిపంద చర్య

- ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం

ఓటమి భయంతో ఎటూ పాలుపోక వైసీపీ పిరికిపంద చర్యలకు పాల్పడుతోందని మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ వాహనాన్ని దహనం చేశారన్న సమాచారంతో ఆయన హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. అక్కడ కాలిపోయిన వాహనాన్ని పరిశీలించారు. సంఘటన ఎలా జరిగిందన్న విషయంపై పలువురిని అడిగి ఆరా తీశారు. అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఇది ముమ్మాటికీ వైసీపీ వారి కుట్ర ఫలితమేనని స్పష్టం చేశారు.

అనంతరం అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న డ్రైవర్ బాబాచారిని పరామర్శించారు. డ్రైవర్ కుటుంబీకులు సంఘటన గురించి వివరిస్తూ భోరున విలపించారు. బాబాచారిని పరామర్శిస్తూ ముందు పూర్తి చికిత్స తీసుకుని కోలుకోవాలని చెప్పారు. అన్నీ తాను చూసుకుంటానని, ఏమాత్రం అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. టీడీపీ ప్రచార వాహనాన్ని నడి రోడ్డుపై దగ్ధం చేసిన సంఘటన గురించి ఇప్పటికే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.



ఘటనా స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

ప్రశాంతంగా పాలిసెట్

- పరీక్షకు 4369 మంది విద్యార్థులు హాజరు



రాయచోటిలో పాలిసెట్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అబ్జర్వర్స్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 27: జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని మదనపల్లె, కలికిరి, రాజంపేట, రాయచోటి పట్టణాల్లో 14 పరీక్షా కేంద్రాల్లో అధికారులు అత్యంత పకడ్బందీగా పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 4369 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 2471 మంది బాలురు, 1898 మంది బాలికలు ఉన్నారు. పరీక్షకు 88.48 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు ప్రత్యేక పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు.

అద్భుత క్షేత్రం గండి

- రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్

చక్రాయపేట, ఏప్రిల్ 27: కడప జిల్లాలోని గండి వీరాంజనేయస్వామి క్షేత్రం అద్భుత క్షేత్రమని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరామసత్యనారాయణ (ఐఏఎస్) పేర్కొన్నారు. ఆయనతో పాటు అడిషనల్ కమిషనర్ శ్రీరామచంద్రమోహన్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్, డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ శనివారం గండి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి వారిని ఆహ్వానించగా ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, వేద పండితులు రామ్మోహన్‌శర్మ, గోపాలస్వాములు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, పాపాఘ్ని పవిత్రత, మకరతోరణం, శ్రీరామచంద్రుని చరిత్ర వివరించారు. అనంతరం రూ.14.50 కోట్లతో జరుగుతున్న నూతన ఆలయం నిర్మాణ పనులను పరిశీలించారు. ఒక వైపు పాపాఘ్ని, మరోవైపు తిరుమల పోలి ఉన్న కొండలు చూడచక్కగా ఉందన్నారు. మరిన్ని కాటేజీలు, వసతిగృహాలకు పెయింటింగ్‌లకు ముకుందరెడ్డి కోరగా ఆయన సమ్మతించారు. కార్యక్రమంలో ఈఈ గంగయ్య, స్థపతి పరమేశ్వరప్ప, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



పొలిటికల్..గుసగుస...



రాజంపేట, ఏప్రిల్ 27: ఎన్నికల తేదీ ముంచుకొస్తోంది. పోటీ చేసుకునే అభ్యర్థులందరూ క్షణం తీరిక లేకుండా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచారంతో పాటు నేతల సమీకరణాలు, ప్రత్యర్థుల ఎత్తుగడలను తిప్పికొట్టడం, ప్రధాన నాయకులను ప్రచారాలకు పంపడం ఇలా ఎన్నో పనులతో తీరిక లేకుండా తిరుగుతున్నారు. క్షణమొక యుగంగా ముందుకు సాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏ రాజకీయ వ్యవహారం పదిమందిలో మాట్లాడినా అది పక్కవారికి తెలిసిపోతుంది. అది వారికి ఇబ్బంది అవుతుంది. ఏ రాజకీయ అంశమైనా చాలా రహస్యంగా మాట్లాడుకోవాల్సి ఉంటుంది. అందువల్ల సందు దొరికితే చాలు పోటీచేసే అభ్యర్థులతో సీక్రెట్‌గా ప్రధాన నాయకులు మాట్లాడుకుంటున్నారు. ఎక్కడ కొంత సమయం దొరికినా.. అటూఇటూ ఎవ్వరూ లేని సమయంలో రహస్య సమాచారాన్ని చెవుల్లోకి ఎక్కిస్తున్నారు. ఇందులో భాగంగా ఎప్పుడూ నిబ్బరంగా, అదరక, బెదరక ముందుకు సాగుతూ ఉండే సుగవాసి బాలసుబ్రమణ్యంతో అనేక మంది నాయకులు ప్రధాన అంశాలను రహస్యంగా చెప్పడం కనిపించింది.

దోసెలు వేస్తూ.. ఓటర్లను అభ్యర్థిస్తూ...

కురబలకోట, ఏప్రిల్ 27: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అంగళ్లు బస్టాండ్ కూడలిలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి దోసెలు వేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని పలువురి ఓటర్లను కోరారు. ఆయన వెంట రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీష్ వేమన, పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దోసెలు వేస్తున్న జయచంద్రారెడ్డి


పార్టీలకు కొమ్ముకాస్తే.. ఉద్యోగం ఊడినట్లే

కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 27: ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీకి బహిరంగంగా మద్దతు తెలపకూడదు. అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఉద్యోగులకు వివిధ రాజకీయపార్టీల నాయకులపై అభిమానం ఉన్నా ఎన్నికల ప్రచారంలో ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఉద్యోగులు ఎవరైనా ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులు రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వకూడదు. ఉద్యోగులు ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. ఎన్నికల్లో అభ్యర్థుల పక్షాన ప్రచారం చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారం చేసినట్లు ఆధారాలతో రుజువైతే ఉద్యోగానికి ఎసరు వస్తుంది. ప్రభుత్వం నుంచి ఏ రకంగా అయినా నెలనెలా డబ్బులు పొందేవారు ఎన్నికల ప్రచారం చేయడానికి అనర్హులు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చాలా మంది వలంటీర్లు, ఆర్పీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు భాగస్వాములు కావడం వివాదానికి దారి తీస్తుంది. మోటరు బైకుల ర్యాలీలు, సాధారణ ర్యాలీలు, సభల్లో పాల్గొనకూడదు. ఒక పార్టీకి చెందిన వారు మరో పార్టీ వారి రోజువారి ప్రచారాలు ఇతర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎప్పుడు ఏం చేస్తున్నారో ఏ సమయంలో ఏం చేస్తున్నారో రికార్డింగ్ చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లలో చిత్రీకరించి సంబంధిత క్లిప్పింగ్‌లను నేరుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపుతున్నారు. ఆధారాలు ఉంటే ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. పార్టీలకు సంబంధం లేకుండా సమావేశాలు నిర్వహించాలి. లేదంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. ఆధారాలతో ఎవ రైనా జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోను ఉంది. పాఠశాల విద్యార్థులనుంచి వృద్ధుల వరకు స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. పార్టీ నేతలు ప్రచారంలో పాల్గొంటే వారితో పాటు ఫొటోలు దిగడం, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాల ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, ఫోన్లు చేయడం పరిపాటిగా మారింది. సోషల్ మీడియా ఆధారాలతో కూడా ఉద్యోగులపై అధికారులు వేటు వేసే అవకాశం ఉంది. అందుకే ఉద్యోగులు ప్రచారానికి దూరంగా ఉండాలి. ఉద్యోగులే కాకుండా ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందే వారంతా పార్టీల ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల నియామావళి ఉల్లంఘన కిందకే వస్తుంది.

ఆ నలుగురిదే పెత్తనం..!

- ఐదేళ్లలో వారు చెప్పిందే వేదం
- పనులు, ఫలహారాలు వారికే...
- జీర్ణించుకోలేని నాయకులు, కార్యకర్తలు



రైల్వేకోడూరు, ఏప్రిల్ 27: ఏ పార్టీలోనైనా అందరినీ సమానంగా చూసుకునే బాధ్యత నాయకత్వానికి ఉంటుంది. కానీ ఈ నియోజకవర్గంలో మాత్రం ఆ నలుగురు చెప్పిందే వేదం. పనులు గాని, ఫలహారాలు గాని అప్పనంగా ఇచ్చేశారు. ఆ నలుగురిలో ఇద్దరు రైల్వేకోడూరు, మరొకరు చిట్వేలి, ఇంకొకరు ఓబులవారిపల్లె మండలాల్లో ఉన్నారు. ఇది జీర్ణించుకోలేని నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల్లో చేరుతున్నారు. పార్టీ నాయకుడిని నమ్ముకుని పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సైతం కష్టపడి పనిచేసిన నాయకులను, కార్య కర్తలను మరిచిపోయి అధికార దాహంతో కళ్లు మూసుకు పోయి ఆ నలుగురు చెప్పిందే వేదంగా మారడంతో నాయకులు, కార్యకర్తలు ప్రాధాన్యత కల్పించే పార్టీలలో చేరుతున్నారు. నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఆ నలుగురు ఏం చెబితే అది చేసేశారు. దీంతో ఆ పార్టీలో విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. నిన్నా, మొన్నా వచ్చిన నాయకులను పక్కన పెట్టుకుని వారికి ప్రాధ్యానత కల్పించే పార్టీలో తాముండలేమని తెగేసి చెబుతున్నారు. చాలా మంది వెళ్లారు కూడా. పార్టీలో కీలకంగా, ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేసి, జెండా పట్టుకుని, పార్టీనే నమ్ముకుని ఉన్న నాయకులు, కార్యకర్తలను విస్మరించారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఎవరికి లేనంత ప్రాధాన్యత పార్టీలో వారికి ఇవ్వడంతో అసమ్మతి సెగలు రగిలాయి. ఏ పని ఎవరికి ఇవ్వాలనేది కూడా ఆ నలుగురు చెప్పే స్థితికి చేరడం.. నాయకత్వం కూడా వారు చెప్పిందే పాటించడంతో చాలామంది కీలక నేతలను ఆ పార్టీ కోల్పోయింది. ఎక్కడ రోడ్డు వేయాలన్నా, పోలీస్‌స్టేషన్‌లో సిఫార్సు చేయాలన్నా, కార్యాయాల్లో ఏ పని చేయాలన్నా ఆ వీరి అత్యుత్సాహమే. దీన్ని నియోజకవర్గ ప్రతినిధి తూచా తప్పక పాటిస్తుంటారు. ఐదు మండలాల్లో కీలకమైన నేతలు ఉన్నా వారితో పని లేకుండా ఆ నలుగురిదే పెత్తనంగా ఉంటోంది. వీరు పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో కూడా ప్రభావితం చేయడానికి చూశారు. అయినా అక్కడ కీలక నేతలు ఉండడంతో వారి ఆటలు సాగలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాలకు పరిమితమై దోచుకున్నట్లు పార్టీ వర్గాలు చెప్పుకోవడం కొసమెరుపు. ఏదేమైనా అసమ్మతి నాయకుల వల్ల టీడీపీకి మేలు జరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

రెడ్లు, బలిజల మధ్యే ఢీ

- ఆది నుంచి ఈ రెండు కులాల మధ్యే పోటీ
- నేడు సుగవాసి-ఆకేపాటిలు
- శాంతికాముక ప్రదేశం - కోదండరాముడు, అన్నమాచార్యులు నడయాడిన ప్రాంతం
- రాజంపేట అసెంబ్లీ ఎన్నికలపై సింహావలోకం



రాజంపేట, ఏప్రిల్ 27: రాజంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో ఆది నుంచి రెడ్లు, బలిజల మధ్యే పోటాపోటీ ఉంటోంది. అన్నమయ్య జిల్లాలో శాంతికాముక ప్రదేశంగా, అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, ఆంధ్రాభద్రాద్రి ఒంటిమిట్ట కోదండరాముడు ఉన్న ప్రదేశంగా ఈ నియోజకవర్గం ఎంతో కీర్తిగడించింది. పార్లమెంటరీ కేంద్రంగా, సబ్ కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా కూడా ఉంది. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో కూడా సుగవాసి-ఆకేపాటిలు ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిలబడ్డారంటే బలిజ, రెడ్ల మధ్య ఎంత పోటీ ఉందో అర్థం చేసుకోవచ్చు.

సార్వత్రిక ఎన్నికల వ్యవస్థ ఏర్పాటైనప్పటి నేటి వరకు ఈ స్థానం బలిజలు, రెడ్ల సామాజిక వర్గాల మధ్యనే పోటీ జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో అనాదిగా రెడ్లు, బలిజలు రాజకీయ ఆదిపత్య పోరులో ఉన్నారు. 1955 నుంచి 2024 ఎన్నికల వరకు ఇదే పరిస్థితి కానవస్తోంది. ఒక సారి ఈ ఎన్నికల గురించి ఆలోచిస్తే మొత్తం 15 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్లు, బలిజల మధ్యే పోటీ జరిగింది. ఈ సామాజిక వర్గాలకు సంబంధించిన నేతలే ఎమ్మెల్యేలుగా గెలుపొందుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. టీడీపీ తరఫున సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేస్తున్నారు. ఈయన రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే అయిన సుగవాసి పాలకొండ్రాయుడు కుమారుడు. ఈయన బలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రధాన నాయకుడు కూడా. ఎంటెక్ ఉన్నత విద్యను అభ్యసించి రెండు సార్లు జడ్పీటీసీగా గెలుపొంది, జడ్పీ వైస్ చైర్మన్‌గా, కొద్ది రోజులు జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఒకసారి ఉప ఎన్నికల్లో రాయచోటి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం అనూహ్యంగా ఆయనకు రాజంపేట ఎమ్మెల్యే టికెట్టు లభించడంతో ఆయన ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇక వైసీపీ నుంచి సిట్టింగ్ జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పోటీ చేస్తున్నారు. ఈయన గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈయన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో ప్రీతిపాత్రుడు. ఈ విధంగా రెడ్డి, బలిజ సామాజిక వర్గాలకు సంబంధించిన నేతలు తిరిగి పోటీ చేస్తుండటంతో ఈ రెండు సామాజిక వర్గాలతో పాటు ఇతర వర్గాలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.



సుగవాసి వైపే సుడిగాలి

ఈ ఎన్నికలను మనం ఒకసారి పరిశీలిస్తే టీడీపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నది రాజకీయ విశ్లేషకుల భావన. ఎందుకంటే అభ్యర్థికి క్రమశిక్షణతో పాటు ఉన్నత రాజకీయ ప్రమాణాలు, సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగి ఉండటం ప్రధాన అంశం. అన్నింటికంటే ముందు రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లి ఒకప్పటి రాయచోటి నియోజకవర్గ ప్రాంతం. ఈ మండలం వారికి పెట్టని కోట.. అదే విధంగా రాయచోటి ఆనుకొని ఉన్న సుండుపల్లి మండలం వీరికి బాగా కలిసివచ్చే అంశం.. ఈ రెండు మండలాల్లో 60 వేల ఓట్లు ఉన్నాయి. అత్యధికం సుగవాసి వైపే మొగ్గు చూపే అంశం. రాజంపేట పట్టణంతో పాటు మండలం టీడీపీకి చాలా అనుకూలంగా ఉంది. ఇక నందలూరు మండలంలో అదే పరిస్థితి. సిద్దవటం, ఒంటిమిట్టలో కూడా టీడీపీ గాలి వీస్తోంది. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గంలోని 80 శాతం మంది సుగవాసికి మద్దతు పలుకుతున్నారు. ఇది బాగా కలిసివచ్చే అంశం.. వైసీపీ అభ్యర్థి అమర్‌నాథరెడ్డికి రెడ్డి సామాజిక వర్గంతో పాటు ప్రధానంగా క్రిస్టియన్‌లు, ముస్లింలు ఇతర కులాలు ఉన్నప్పటికీ అవి పెద్దగా కలిసి రావన్నది చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఈ ఐదేళ్ల జగన్ పాలనలో రాజంపేటలో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. జిల్లా కేంద్రం కాకపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం, బాధితులకు న్యాయం చేయకపోవడం, ఇంజనీరింగ్ కళాశాలను నిలుపుకోలేకపోవడం, పట్టణాన్ని అభివృద్ధి చేయకపోవడం ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి జరగకపోవడంతో వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కావున టీడీపీకి ఇవి అనుకూలించే అంశాలుగా చెప్పవచ్చు.

ఇక ఓట్ల గురించి ఆలోచిస్తే..

రాజంపేట నియోజకవర్గంలో నేటి లెక్కల ప్రకారం 2,37,112 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో అత్యధికులుగా సుమారు 30 వేల పైచిలుకు బలిజలుండగా 23 వేల మంది రెడ్డి సామాజిక వర్గ నేతలు, 35వేల మంది ఎస్సీలున్నారు. చేనేతలు 8వేల మంది, ఇక బీసీలు 40వేల మంది ఉన్నారు. కమ్మ సామాజిక వర్గం 12 వేలు, క్షత్రియ సామాజిక వర్గం 12 వేలు పైచిలుకు ఉన్నారు. ఇక ముస్లింలు 10వేలు పైబడి ఉన్నారు. ఇక ఎస్టీ ఇతర సామాజిక వర్గాలన్నీ పది వేల పైబడి ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రధానంగా రెడ్డి, నాన్‌రెడ్డి ఫీలింగ్ ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేస్తున్న సుగవాసికి ఎక్కువగా టీడీపీకి కంచుకోటలైన కమ్మలు, బలిజలు, ఎక్కువ శాతం క్షత్రియులు, బీసీలు, ముస్లింలు మొగ్గు చూపుతున్నారు. ఇక వైసీపీ తరఫున పోటీ చేస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి ప్రధానంగా రెడ్డి సామాజిక వర్గంతో పాటు ముస్లింలు, క్రిస్టియన్లు, ఎస్సీలు మొగ్గు చూపుతున్నారు. ఇక గత ఎన్నికలను సింహావలోకనం చేసుకుంటే 1955 నుంచి నేటి వరకు ఎక్కువ సార్లు బలిజ సామాజిక వర్గం నుంచి పోతురాజు పార్థసారథి ఒక సారి ఎన్నికయ్యారు. ఆ తరువాత అదే సామాజిక వర్గానికి సంబంధించిన బండారు రత్నసభాపతి మూడు సార్లు, పసుపులేటి బ్రహ్మయ్య రెండు సార్లు, రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి కొండూరు మారారెడ్డి ఒకసారి, ఆయన శ్రీమతి కొండూరు ప్రభావతమ్మ మూడు సార్లు, కసిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి ఒక సారి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి రెండు సార్లు, మేడా మల్లికార్జునరెడ్డి రెండు సార్లు ఎన్నికయ్యారు. దీని వల్ల ఈ రెండు సామాజిక వర్గ నేతలే ఎన్నికవుతూ వస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్న విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది.



మీ బిడ్డను అంటివి.. మోకాలొడ్డితివి

మోసం గురూ

- అవ్వతాతల ఉసురు కొట్టదా.. జగన్
- సాయం మాటున పేదలకు ఏడుపు
- ఆరంచెల పరిశీలన పేరుతో లబ్ధిదారుల్లో కోత

సుండుపల్లె, ఏప్రిల్ 27: జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ప్రధానమైనది సామాజిక పింఛన్లు.. వీటిపై ఆధారపడి జీవించే వారు లక్షలాది మంది ఉన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖు కోసం ఎదురుచూసే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇలా ఎందరో ఉన్నారు. ఏ ఆధారము లేక, అయిన వాళ్ల అలనా పాలనకు నోచుకోక పింఛను పైసలతో పొట్ట నింపుకొని, మందులు కొనుగోలు చేసుకుని జీవిస్తున్నారు. అలాంటి వారిలో పలువురికి సాంకేతిక తప్పిదాలు. రాజకీయాల జోక్యంతో పింఛన్లు రద్దు కావడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నామని ఓ వైపు చెబుతూనే ఉన్న వారికి కోత పెట్టారు. తొలగించిన వాటి లెక్క దాచేసి కొత్త లెక్క ఎక్కడా తక్కువ కాకుండా చూపుతూ వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటోంది.

అంతేగాకుండా సుండుపల్లె మండలంలో గత కొన్ని సంవత్సరాల నుంచి పింఛన్ వస్తున్న వారికి తీసేసి మళ్లీ కొత్తగా వైసీపీ ప్రభుత్వంలో ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకున్నారు. ఏళ్ల తరబడి పింఛను తీసుకుని బతుకుతున్న వారిని చేయని తప్పునకు బాధ్యులను చేస్తూ ఆకస్మికంగా జాబితా నుంచి తొలగించడంతో బాధితుల గోడు వర్ణనాతీతం. వైసీపీ ప్రభుత్వం ఆరంచెల పరిశీలన పేరుతో వందల మందిని పింఛన్లకు దూరం చేస్తోంది. విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటిన కుటుంబాల్లోని వారు, కుటుంబ సభ్యుల పేరుతో నాలుగు చక్రాల వాహనం ఉన్న వారు, వెయ్యి చదరపు అడుగుల ఇంటి స్థలం ఉన్న వారు, కుటుంబ సభ్యుల్లో ఆదాయపన్ను చెల్లించినా, ఐదెకరాలకు పైన పొలం ఉన్నా రూ.15 వేల జీతం తీసుకునేవారు ఉంటే పింఛను రద్దు చేశారు. సుండుపల్లె మండలంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రకాల కారణాల వల్ల గత కొన్ని సంవత్సరాల నుంచి పింఛన్ తీసుకుంటున్న సుమారు 1200 మంది లబ్ధిదారులను తొలగించినట్లు సమాచారం. ప్రభుత్వం కొన్ని పింఛన్లు కొత్తవి మంజూరు చేసి అవి జగనన్న ప్రభుత్వంలో భారీ సంఖ్యలో పింఛన్లు అందిస్తున్నట్లు డప్పు కొట్టుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 7909 మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ జరుగుతోంది. వీటిలో 90 శాతం గత ప్రభుత్వాల్లో లబ్ధిదారులుగా గుర్తించి నట్లు తెలుస్తోంది. ప్రతి నెల మండలానికి రూ.2,34, 34500 నగదును పంపిణీ చేస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల నుంచి పింఛన్ తీసుకున్న వారిని సైతం ఈ ప్రభుత్వంలో తొలగించినట్లు తెలుస్తోంది. తమ కడుపు కొట్టకండి పింఛన్లు ఇప్పించండి మహాప్రభో అని లబ్ధిదారులు వాపోతున్నారు.

అల్లుడు వచ్చాడని.. కూలర్ వేశా అంతే..!



ముంబై నుంచి నా కూతురు, అల్లుడు ఇంటికి వచ్చారు. ఎండలు అధికంగా ఉన్నాయని ఇంట్లో కూలర్ వేశాను. కరెంటు బిల్లు అధికంగా వచ్చిందని పింఛన్ తీసేశారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన 8 నెలలకే పింఛన్ కోల్పోయాను. పింఛన్ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాను. తొలగించినప్పటి నుంచి పొట్టకూటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను.

- షేక్.అబ్దుల్‌నబీ, అర్హుడు, సుండుపల్లె

బాబు ఇస్తే.. జగన్ తీసేశాడు



టీడీపీ ప్రభుత్వంలో నాకు పింఛన్ మంజూరైంది. సీఎంగా జగన్ వచ్చాక నా పింఛన్‌ను తీసేశాడు. నా లాగా ఎంతో మంది అర్హులను ఈ ప్రభుత్వం మోసం చేసింది. చంద్రబాబు పాలనలోనే గిరిజనులకు మేలు జరిగింది. చంద్రబాబు 50 సంవత్సరాలకే గిరిజనులకు పింఛన్ ఇచ్చాడు.

- అమ్మనాయక్, అర్హుడు, ఆరోగ్యపురం

ప్రభుత్వం రాగానే తీసేశారు



గత 15 ఏళ్ల నుంచి నాకు పింఛన్ వస్తోంది. వస్తున్న పింఛన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసేశారు. 20 ఏళ్ల క్రితం నా భర్త చనిపోయాడు. అప్పటి నుంచి అష్టకష్టాలు పడుతుంటే ప్రభుత్వం నాకు పింఛన్ వచ్చే భాగ్యం కల్పించింది. ఈ మహానుభావుడు సీఎం అయ్యాడు. మా కడుపు కొట్టాడు.

- చింతం రామలక్ష్మమ్మ, అర్హురాలు, చెన్నంశెట్టిపల్లె

బ్యాండేజి డ్రామాలు ఆపవా జగన్..?



మదనపల్లెటౌన్, ఏప్రిల్ 27: ఎవరికైనా శస్త్రచికిత్స చేస్తే 12 రోజుల్లో గాయం మాన్పుకుని కోలుకుంటారు. అలాంటిది నుదిటిపై గాయానికి మూడు కుట్లు వేసుకున్న జగన్ 14 రోజులవుతున్నా బ్యాండేజీతో ప్రచారం చేస్తూ డ్రామాలు ఆడుతున్నారని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ్ ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత ఆధ్వర్యంలో నుదిటికి బ్యాండేజి, కళ్లకు బ్యాండేజి కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అరుణ్‌తేజ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు యువతకు ఉద్యోగాలు లేకుండా జగన్ ఫుట్‌బాల్ ఆడుకున్నారని, ఆ దెబ్బలకు రాష్ట్ర యువత గాయాలపాలైందన్నారు. జాబ్ క్యాలెండర్లు విడుదల చేయని జగన్, రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలను తరిమివేసి యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. మే 13వ తేది యువత తమ సత్తా చాటుతుందని, జగన్‌ను గద్దె దింపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు ప్రణయ్, గగన్, జశ్వంత్, లలిత్, శివ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో నుదిటికి, కళ్లకు బ్యాండేజి కట్టుకుని నిరసన తెలుపుతున్న తెలుగు యువత నాయకులు

ఆంధ్రజ్యోతి
కడప
జన కేతనం
ఆదివారం 28 ఏప్రిల్ 2024
www.andhrajyothy.com

ఎన్నికల 'చిత్రం'



కడప నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి రెడ్డెప్పగారి మాధవి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఓ దుకాణం వద్ద ఆమె దోశలు పోసి ఆకట్టుకున్నారు.

రోడ్లిలా.. వెళ్లేదెలా...?

- నిధుల్లేక... రోడ్లెయ్యలేక.. వంతెనలు కట్టలేక...
- ఇదేంది జగనన్నా



దువ్వూరు మండలంలోని పలు గ్రామాల రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యాయి. బయనపల్లె రోడ్డు సహా రామాపురం, చల్లబసాయిపల్లె, బయనపల్లె రహదారులు కంకరలేచి గుంతలు ఏర్పడ్డాయి.




బ్రహ్మంగారిమఠం మండలం రేకలకుంట పంచాయితీ బాగాదిపల్లె, చీకటివారిపల్లె గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇది. వర్షం వస్తే ద్విచక్రవాహనాలూ వెళ్లలేని దుస్థితి. రోజుకు వందలాది మంది ప్రయాణిస్తుంటారు.

మైదుకూరు, ఏప్రిల్ 27: గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలని మహాత్మాగాంధీ చెప్పిన మాటలను సీఎం జగన్ తన ఐదేళ్ల పాలనలో తుంగలో తొక్కారు. పంచాయితీలకు సరైన నిధులు కేటాయించక పోవడం, కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం ఇతర పథకాలకు దారి మళ్లించుకుంటూ రహదారులు, కల్వర్టులను సైతం మరమ్మతులు చేయించలేక చేతులేత్తేసి జనాలను నట్టేట ముంచాడు. ఛిద్రమైన రోడ్లు, వర్షం వస్తే కల్వర్టులు పొంగిపొర్లుతూ వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లైతే తారు రోడ్డుకు నోచుకోక రాళ్లురప్పలు తేలియాడుతూ ఇటు వాహనదారులు, పాదచారులకు కష్టాలు తప్పడం లేదు. జగన్ పాలనలో ప్రజలు నరకయాతన పడ్డారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీ పేట, బి మఠం మండలాల్లోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి. మైదుకూరు నుంచి ఉత్సలవరానికి వెళ్లే రహదారిలో గోరే డు వంక బ్రిడ్జి. ఇది అతి పురాతనమైనది. వర్షాకాలం లోనూ, ఎర్రచెరువుకు నీళ్లు వచ్చినా బ్రిడ్జి మీదుగా నీళ్లు పారుతుంటాయి. ఈ బ్రిడ్జి మీదుగా వెంక టాపురం, గొల్లపల్లె, ఉత్సలవరం మీదుగా వ నిపెంట గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి. బ్రిడ్జిపై నీరు ప్రవహి స్తే రాకపోకలకు ఇబ్బం దులు పడు తుంటారు. సర్వాయపల్లె మీదుగా బి. కొత్తపల్లె, లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల రహదారి కంకర లేచి గ౨౦ తలమయమైంది.

శెట్టివారిపల్లె ఎస్సీ కాలనీ రోడ్డు చాలా అధ్వాన్నంగా తయారైంది. రహదారుల వెంట ముళ్ల కంపలు లేచి పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు మరమత్తులు చేయాలని వామపక్ష నేతల ఆధ్వర్యంలో ఆందోళనలు సైతం చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు.

- నిధులు లేక రహదారులు వేయలేని పరిస్థితి ఉంటే మైదుకూరు మండలం పప్పనపల్లెలో మాత్రం నిధులు మంజూరై సకాలంలో కాంట్రాక్టరుకు బిల్లులు రాక పోవడంతో కంకర పరిచి అలాగే వదిలేశారు. వనిపెంట నుంచి పప్పనపల్లెకు 2.1 కిలో మీటర్లకు రూ. 1.25 కోట్లు నిధులు మంజూరయ్యాయి. సకాలంలో బిల్లులు అందలేదని కాంట్రాక్టరు పనులు నిలిపేశారు. దీంతో ఇప్పటికీ కంకరపైనే రాకపోకలు సాగుతున్నాయి.
- ఖాజీపేట మండలం అప్ప నపల్లె రంగాపురం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి. ఓ మోస్తరు వర్షం కురిస్తే పైప్రాంతం నుంచి వచ్చే నీటితో బ్రిడ్జిపై భాగం నిండుకుంటోంది. రంగాపురం, డాంఖాన్‌పల్లె, మల్లాయపల్లె, అన్నలూరు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. రంగాపురంలో జడ్పీహైస్కూల్, హాస్టల్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. బ్రిడ్జి పైకి నీరు పొంగినప్పుడు మైదుకూరు మీదుగా వెళ్లాలి.
- చాపాడు మండలం సోమాపురం పంచాయితీ మొర్రాయిపల్లె, నాగా యపల్లె, ఎస్సీ బీసీ కాలనీల్లో రహదారులు రాళ్లు లేచి ఛిద్రమయ్యాయి.



బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లె వద్ద కల్వర్టు లోతట్టులో ఉంది. వర్షాకాలంలో ఓ మోస్తరు వర్షం కురిస్తే ఈ రహదారిలో అటు ఇటు రాకపోకలు నిలిచిపోయి త్రీవ ఇబ్బందులు గురవుతున్నారు.



ఖాజీపేట మండలం అప్పనపల్లె రంగాపురం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి. 30 ఏళ్ల కిందటిది కావడంతో కుంగి పోతోంది. ఓ మోస్తరు వర్షం కురిస్తే పైప్రాంతం నుంచి వచ్చే నీటితో బ్రిడ్జిపై భాగం నిండుకుంటోంది.

న్యాయానికి ధర్మానికి పట్టం కట్టండి : డాక్టర్ సునీతారెడ్డి

సింహాద్రిపురం, ఏప్రిల్ 27: ఈ ఎన్నికల్లో మీ పవిత్రమైన ఓటుతో న్యాయానికి, ధర్మానికి పట్టం కట్టాలని వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి ప్రజలను అభ్యర్థించారు. శనివారం బలపనూరు, అంకాళమ్మగూడూరు, అగ్రహారం, హిమకుంట్ల, బి.చెర్లోపల్లి, గురిజాల గ్రామాల్లో బస్సు యాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిలకు, పులివెందుల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డిలకు ఓట్లు వేసి గెలిపించాలని సునీతారెడ్డి ప్రజలను అభ్యర్థించారు.

మీకు నిత్యం అందుబాటులో వుండే మా నాన్న వివేకానందరెడ్డి హత్య కావింపబడి మనకు దూరం కావడం చాలా బాధాకరమన్నారు. మా నాన్న ఆత్మ కు శాంతి చేకూరేందుకు షర్మిలను ఎంపీగా గెలిపించుకునేందుకు మీ అందరి సహాయ, సహకారాలు నాకు కావాలని ప్రజలను సనీతారెడ్డి కోరారు. ఈ బస్సు యాత్రలో నర్రెడ్డి తులసిరెడ్డి, కాంగ్రెస్ పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.



బలపనూరు ప్రచారంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీతారెడ్డి

రెండో విడత ర్యాండమైజేషన్

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సిబ్బందికి, రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శనివారం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు, సాధారణ ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్కు సమక్షంలో జరిగింది. ఈ ప్రక్రియ ద్వారా సిబ్బంది, సంబంధిత టీముల ఏర్పాటు నియోజకవర్గాల వారీగా పూర్తి చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 2035 పోలింగ్ కేంద్రాలకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది చొప్పున 15 శాతం రిజర్వుతో నియమించామన్నారు. పీఓ, ఏపీఓలుగా నియమించిన వారికి రెండో విడత శిక్షణ తరగతులు వచ్చే నెల 2, 3వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్‌లో జరుగుతాయన్నారు. జిల్లాలో సమస్యాత్మకంగా గుర్తించిన 527 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. వీరికి సంబంధిత శిక్షణా తరగతులు మే 1వ తేదీ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సీపీఓ వెంకట్రావు, డీఐఓ విజయకుమార్, ఆర్వోలు పాల్గొన్నారు.

బలప్రదర్శన కోసం నేతల పాట్లు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 27: రెండురోజుల్లో అధికార పార్టీ నేతలు పోరుమామిళ్లలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ, అదనపు సమన్వయ కర్తలు పోరుమామిళ్లలో భారీ ర్యాలీకి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని సమాచారం. కార్యకర్తలు కరువయ్యారు, నేతలు బరువయ్యారు, బలం ఎక్కువ ఉన్న చోట వర్గాలు మారడం, నేతల వద్ద బలనిరూపణ కోసం జన సమీకరణ కోసం డబ్బు పెట్టుబడి పెట్టడానికి ఎంతకైనా వెనుకాడడం లేదు. రెండురోజుల్లో పోరుమామిళ్లలో జరిగే భారీ ర్యాలీకి ఇప్పటికే ఆయా ప్రాంత నేతల ద్వారా ఓ వర్గం జన సమీకరణకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. జెండా పట్టుకుని తిరిగితే పురుషునికి రూ.300, మందుకు మరో 200, మహిళలకు 300 లేదా 400 వంతున చెల్లించి భారీగా జన సమీకరణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. డబ్బు, మందు ఇస్తేనే వెళతామని కొందరు భీష్మించుకోవడంతో వారి వ్యసనాలను తమ అవసరాలుగా మలుచుకుని వారిని బుజ్జగిస్తూ కార్యక్రమం అయిపోయే వరకు ఉంటే చాలు తరువాత మీ దారి మీది అని అంటున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు డబ్బు ఖర్చు పెడతారు, ఎన్నికలైతే వారికి గుర్తుఉంటామా, ఊరికనే ఎందుకు రావాలని డిమాండ్ చేస్తుండడంతో జనసమీకరణకు పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చి బారీగా బలప్రదర్శన చేయాలనే తలంపుతో ఉన్నట్లు సమాచారం.

జాతీయ ఉపాధి పనులను పరిశీలించిన పీడీ



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న పీడీ యధుభూషణ్‌రెడ్డి

బి.కోడూరు, ఏప్రిల్ 27: మండల పరిధిలోని పాయలకుంట్ల, మేకవారిపల్లె గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు పనిచేస్తుండగా, శనివారం పీడీ యదుభూషణ్‌రెడ్డి పరిశీలించారు. అనంత రం ఆయన కూలీలతో మాట్లాడుతూ పనులకు ఉదయాన్నే వచ్చి త్వరగా వెళ్లాలని ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల ఉపాధి సిబ్బంది తాగునీటిని , ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకుని పనుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే వేసవికాలం కూలి ప్రతి ఒక్కరికీ 300 రూపాయలు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వచ్చి ఉదయాన్నే పనులు ముగించుకుని వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలని వారు తెలిపారు. అనంతరం మేకవారిపల్లె గ్రామ పంచాయతీలో హార్టికల్చర్ ప్లాంటును పరిశీలించి ఉపాధి సిబ్బందితో గ్రామ సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేసి జరుగుతున్న పనులపై జరగబోవు పనులపై అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. వీరి వెంట ఎంపీడీవో ఉదయభాస్కర్‌రాజు, ఏపీవో రాజాసాహెబ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని - ఒకరికి గాయాలు

ఖాజీపేట, ఏప్రిల్ 27: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బి.వెంకటయ్యకు గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... సీతారామపురం దగ్గరగల పోలంగురాయిపల్లె వాసి వెంకటయ్య పని నిమిత్తం నాగపట్నం వెళుతూ పత్తూరు సమీప హైవే క్రాస్ అవుతుండగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు.

ఓటుహక్కును వినియోగించుకోవడం బాధ్యత

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 27: ప్రజాస్వామ్య దేశంలో విలువైన ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరులుగా మన అందరి బాధ్యత అని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకుడు, కడప నగర కమిషనరు ప్రవీణ్‌చంద్ అన్నారు. శనివారం సాయంత్రం మన ఓటు మన ధైర్యం, మన భవిత, అన్న నినాదంతో కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం జరిగింది. ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించే బైక్ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు విలువను చాటి చెప్పేందుకు కొత్త ఓటర్లను ప్రోత్సహించడం, ఓటింగ్ నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయడమే స్వీప్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుని ప్ర జాస్వామ్య బలోపేతానికి సహకరించాలన్నారు. ఓటు నమోదు చేసుకోవడమే కాకుండా ఎన్నికలు వచ్చినప్పుడు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే మంచి నేతలు ఎన్నికై దేశ అభివృద్ధికి దోహదపడిన వారవుతారన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కును పొంది ఆ ఓటు హక్కును బాధ్యతాగా వినియోగించు కోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 16.39 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, వీరంతా ఓటును తమ హక్కుగా గుర్తించడంతో పాటు తమ బాధ్యతాగా భావించాలన్నారు. అర్హులంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేలుడు మందు కొరికి తీవ్రగాయాలపాలైన పశువు



కాశినాయన ఏప్రిల్ 27: ఇటుకులపాడు రైతు బి.నడిపి ఓబయ్య పశువు పేలుడు పదార్థం కొరకడంతో నోటికి తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ అమర్‌నాధ్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు మీదిగ పుల్లయ్య, గురయ్య గడ్డివామిలో గుర్తు తెలియని వ్యక్తులు పందులవేటకు ఉపయోగించే నల్లమందును దాచారు. శుక్రవారం సాయంత్రం గడ్డివామివద్దకు పోయిన పశువు యాధృశ్చికంగా కొరకడంతో నోరు నుజ్జు నుజు అయ్యింది. విషయం తెలిసిన పోలీసులు ఘటనా ప్రదేశానికి పోయి పరిశీలించి ఆమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నా మన్నారు. తీవ్ర రక్తగాయాలపాలైన పశువును చికిత్సకోసం ప్రొద్దుటూరు పశువైద్యశాలకు తరలించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి :ఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 28: ప్రజలు ఎలాంటి ప్రలోబాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌పీ సిద్దార్థ్ కౌశల్ సూచించారు. శనివారం సాయంత్రం ఎస్పీ చెన్నమరాజుపల్లె ప్రజలతో ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రలోబాలకు గురికావద్దని, ఎవ్వరితో బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. డీఎస్పీ మురళీధర్, రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

సింహాద్రిపురం, ఏప్రిల్ 27: సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాతపల్లి క్రాస్ చెక్ పోస్ట్ విధుల్లో నిర్లక్ష్యం వహించినకానిస్టేబుల్ కె.శివప్రపాద్(పి.సి.2825)ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శనివారం ఉత్తర్వు లు జారీ చేశారు. కానిస్టేబుల్ మద్యం సేవించి విధులకు హాజరైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు.

అభివృద్ధిలో పోటీ పడండి

ఖాజీపేట, ఏప్రిల్ 27: అభివృద్ధిలో పోటీ పడండి కానీ కార్యకర్తలను భయ భ్రాంతులను చేసి పార్టీలో చేర్చుకోవడం మంచి పద్ధతి కాదని కోటంగురాయపల్లె టీడీపీ నేతలు శివారెడ్డి, ఓబుళరెడ్డి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో గ్రామస్థులు స్వచ్ఛందంగా పార్టీలో చేరితే వారిని భయపెట్టి నాలుగు కుటుంబాలు మాత్రమే చేర్చుకుని గొప్పలు చెప్పడం కాదని, మిగతావారంతా టీడీపీ వైపే ఉన్నారన్నారు. ఓటర్లను భయపెట్టి బలవంతంగా పార్టీలో చేర్చుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

నందలూరు, ఏప్రిల్27: డాక్టర్ అంబేడ్కర్ గురుకులం ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు 29వ తేదీ సోమవారం కడప చిన్నచౌక్‌లోని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని అడపూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ పరీక్ష రాసిన బాలికలు ర్యాంకు కార్డు, ఆధార్, హాల్ టికెట్లు తీసుకుని ఉదయం 9 గంటలకు చిన్నచౌకు గురుకుల పాఠశాలకు చేరుకోవాలని ఆమె కోరారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

సుండుపల్లె, ఏప్రిల్ 27: సుండుపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ మిట్టబిడికి సమీప మారెమ్మ, కాళికాదేవి ఆలయంలో దొంగలు హుండీ పగలగొట్టి నగదును అపహరించినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. హుండీలో సుమారు రూ.4 వేల నుంచి రూ.5 వేలు నగదు ఉంటుందని తెలియజేశారు. తాళాలు పగలగొట్టి హుండీని సమీప మామిడి తోటలోకి తీసుకెళ్లి పగలగొట్టినట్లు వివరించారు.

కమ్మపల్లిలో సీతారాముల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 27: చిన్నఓరంపాడు కమ్మపల్లి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శనివారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీ రామనవమి సందర్భంగా గ్రామంలోని రామాలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

యల్లమ్మ ఆలయంలో చండీ హోమం



సుండుపల్లె, ఏప్రిల్ 27: చెన్నంశెట్టిపల్లె వద్ద నిర్మిస్తున్న యల్లమ్మ ఆలయంలో శనివారం ఉదయం గణపతి, నవగ్రహ పూజలు చేశారు. గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఆదివారం ఉదయం కొత్తపేట బండెన్న స్వామి ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి ఆధ్వర్యంలో విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ, కుంభా భిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. టీడీపీ నేతలు వెంకట్రమణ, రామాంజులు, తోట రవీంద్ర, నగేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

గాలివీడు, ఏప్రిల్27: స్థానిక బ్రాహ్మణవీధి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ 29నుంచి మండల పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

సుండుపల్లె, ఏప్రిల్27: మేస్త్రీ గొర్రిండ్ల నరసింహులు ఆయన కుమా రుడు వ్యాయామ ఉపాధ్యాయుడు నాగార్జున శనివారం ఆలయానికి రూ.50 వేలు విరాళం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. టీడీపీ నేతలు చెన్నంశెట్టి వెంక ట్రమణ, రామాంజులు, నగేశ్, తోట రవీంద్ర, జగిలి వెంకట్రమణ, సిద్దు, భాస్కర్, జనసేన మండల అధ్యక్షుడు ఓబులేసు పాల్గొన్నారు.

సుగవాసికి భువనగిరిపల్లె బ్రహ్మరథం

● లక్ష్మీ నరసింహ ఆలయంలో పూజలు ● ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు



సుగవాసి బాలసుబ్రమణ్యంతో భువనగిరిపల్లె ప్రజలు

రాజంపేట, ఏప్రిల్ 27: రాజంపేట ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు రాజంపేట మండలంలోని భువనగిరిపల్లెలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆ గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, జనసేన యూత్‌నాయకులు బాణసంచా పేలుస్తూ, డప్పులు వాయిస్తూ, హారతులు పట్టి స్వాగతం పలికారు. . అంతకు ముందు ఆయన భువనగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, పూజలు చేసి, శాలువాలతో సత్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డిని కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాజంపేట అబ్జర్వర్ దుర్గాప్రసాద్, ఉమ్మడి కడప జిల్లా టీడీపీ నాయ కులు బాలిశెట్టి హరిప్రసాద్, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బీజేపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి పోతు గుంట రమేష్‌నాయుడు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మాజీ మండల ఉపాధ్యక్షులు నాగా సుధాకర్‌రెడ్డి, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీవాణి, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, దంత వైద్య నిపుణుడు డాక్టర్ నవీన్‌చంద్ర, సుధాకర్, ఊటుకూరు గ్రామ నాయకులు చెంగల్‌రాయుడు, సుబ్బరా యుడు, తెలుగు యువత నాయకులు చంద్రబాబు నా యుడు, జిల్లా తెలుగు మహిళా మాజీ అధ్యక్షు రాలు కుసుమకుమారి, రాజంపేట పార్లమెంటు టీ డీపీ ఉపాధ్యక్షురాలు వాణి, మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నా యుడు, మాజీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, పిడి కిటి సంతోష్‌కుమార్, రాజం పేట పార్లమెంటు లీగ ల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీ నారా యణ, జనసేన పార్టీ నాయ కులు అతికారి కృష్ణ, యల్ల టూరు శ్రీనివాసరాజు, మలి శెట్టి, వెంకటరమణ, సింగం శెట్టి నరేంద్ర తదిత రులు మాట్లాడుతూ రాష్ట్రం లో రానున్నది టీడీపీ, బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వమే నన్నారు.

కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారం చేపట్టడం తథ్యమ న్నారు. వైసీపీ దురాగతాలు, దోపిడీలు, ఇసుక దందాలు, దౌర్జన్యాలు ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిస్తాయన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రాజంపేటను సర్వనాశనం చేశాడన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా చేసి ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు. ఇంజనీరింగ్ కళాశాల రాకుండా చేశారన్నారు. ఇసుక దాహంతో అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులను తెంచేశారన్నారు. ఎంతో విద్యావంతుడు, ఉన్నత విలువలున్న సుగవాసి బాలసుబ్రమణ్యం ఇక్కడ పోటీ చేయడం ఈ ప్రాంతీయులు చేసుకున్న అదృష్టమన్నారు. ఎంపీ అభ్యర్థిగాపోటీ చేస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి రాజంపేటకు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదన్నారు. పుంగనూరు ప్రాంతాన్నే అభివృద్ధి చేసు కొని రాజంపేటకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో భువనగిరిపల్లె మాజీ సర్పంచ్‌లు ఎం.ఎల్.నారాయణ, మన్నేరులక్ష్మీనరసయ్య, టైల్స్ నరసింహ, బలిజ సంఘ జిల్లా అధ్యక్షులు కె.ఎస్.నరసింహ, దేవస్థాన ధర్మకర్త పూల హరి, గ్రామ నాయకులు కావేరిగారి వెంకటరమణ, జనసేన నాయకులు కోలాటం హరి, కొండా హరి, బండ్ల నాగరాజు, కాసారపు నరేష్ టైల తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

‘పరిశ్రమలు రావాలంటే.. బాబు సీఎం కావాల్సిందే..’



ఐటీ ఉద్యోగులకు అభివాదం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఏప్రిల్ 27 : జాబు కావాలంటే బాబూ రావాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తూ రాయచోటికి వచ్చిన టీడీపీ ఐటీ విభాగం ఉద్యోగులతో సుగవాసి బాలసుబ్రమణ్యం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంటు ఐటీ విభాగం అధ్య క్షుడు గిరినాథుని మల్లికార్జున మాట్లాడుతూ ఐటీ ఉద్యోగాలు, పరిశ్ర మలు రావాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని, నరేంద్రమోదీని కేంద్రంలో మూడవ సారి ప్రధానమంత్రిని చేసుకోవాలన్నారు. రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఐటీ ఉద్యోగులు పెద్దఎత్తున ఎన్‌డీఏ కూటమి తరఫున ప్రచారం చేయడం ఆనందనీ యమన్నారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యంను ఐటీ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్ల మెంటు ఐటీ విభాగం అధ్యక్షుడు గిరినాథుని మల్లికార్జున, శ్రీనివా సులు, తులసీరాం, సుదర్శన్, దిలీప్, వరుణ్‌కుమార్, వినోద్, శివసాయి, కిరణ్‌కుమార్, పురుషోత్తం, మురళీ, ప్రసాద్ జనార్ధన్, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లెల శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేటలో టీడీపీ విస్తృత ప్రచారం



భాకరాపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సిద్దవటం, ఏప్రిల్27 : రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలంటూ ఆ యన సోదరుడు జానకిరామ్ సిద్దవటం మండలం భాకరాపేట, మలినేని పట్నం, గాంధీ నగర్, బెటాలియన్ మిట్టపల్లెల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మండల అధ్యక్షుడు మోహన్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు జగదీష్ కుమార్‌రెడ్డి, జనసేన నేత అతికారి కృష్ణ, సంజీవరెడ్డి, తుర్రా ప్రతాప్‌నాయుడు, నాగం నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జవహర్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ రామనాయుడు, బజాజ్ షోరూం అధినేత అయ్యప్ప నాయుడు, రాజానాయుడు, చెంచయ్య నాయుడు, పుత్తా రామచంద్రయ్య, గాలి సుబ్బయ్య, కాడే శ్రీనివాసులు నాయుడు, బొడ్డే రమణ, బొడ్డే లక్ష్మీ నారాయణ, అవ్వారు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత శ్రీనివాసరాజుతో సుగవాసి, సుధాకర్ భేటీ



శ్రీనివాసరాజుతో భేటీ అయిన సుగవాసి సుధాకర్

రాజంపేట, ఏప్రిల్ 27 : రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజును ఆయన కార్యాలయంలో రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం చిన్నాన్న సుగవాసి సుధాకర్ కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ సుగ వాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజా రిటీతో గెలిపించాలని కోరుతూ వారితో ఎన్నికల విషయంపై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల గెలుపుకు మీరు చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీనివాసరాజును అభినందించారు.

బాలసుబ్రమణ్యం గెలుపునకు కృషి చేయండి



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న సుగవాసి శ్రీనివాసులు

ఒంటిమిట్ట, ఏప్రిల్27 : మండలంలోని నాయకులు, కార్యకర్తలు టీడీపీ అభి మానులు టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం గెలుపున కు కృషి చేయాలని మం డల టీడీపీ ఇన్‌చార్జి సుగ వాసి శ్రీనివాసులు అన్నారు. శనివారం టీడీపీ నాయకు లు, కార్యకర్తలతో కలసి ఆయన మండలంలో విస్తృ తంగా పర్యటించారు. ముం దుగా కోదండ రామా లయంలో స్వామివారిని దర్శనం చేసుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శ్రీరామ్ టౌన్‌షిప్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని ప్రతి గ్రామంలో టీడీపీ ప్రచారానికి స్థానిక నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకటనరసయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఓబినేని సుబ్బమ్మ ఇంటికి వెళ్లి ఆయన మద్దతు కోరారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సాయంత్రం స్థానిక హరిత హోటల్‌లో మండలంలోని టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి మండలంలో ప్రచారం ప్రారంభిస్తామన్నారు. మొదటగా కుడమలూరు గ్రామంలో ప్రచారం నిర్వహించేందుకు టీడీపీ నాయకులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, గజ్జల నరసింహారెడ్డి, ఓబినేని సుబ్బమ్మ, బొబ్బిలి రాయుడు, కరెంటు రమణ, ఎం.వి.రమణ, కట్ట నారాయణ, అంగడాల వెంకటసుబ్బయ్య, డాక్టర్‌శివ, మోదగాల నరసింహులు, అడ్వకేటు రామదాసు, మామిళ్ల ఈశ్వరయ్య, చింతరాజుపల్లి రమణ, పత్తి సుబ్బరాయుడు, కరిముల్లా బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లె, గుర్రప్పగారి పల్లెల్లో వైసీపీకి షాక్



సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం



గుర్రప్పగారిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రసాద్‌బాబు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 27 : రాజంపేట మండలం ఉప్పరపల్లెలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. గ్రామానికి చెందిన దొంతం శంకరయ్య ఆధ్వర్యంలో దొంతం వెంకటసుబ్బయ్య, కూరాకు కృష్ణ, కూరాకు నారాయణ, జలగం సుబ్బరాయుడు, మీసాల శ్రీకాంత్, కుందారపు సుబ్బరాయుడు, దొంతం శివ, వెంకటరమణ తదితరులకు చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉప్పరపల్లెను అభివృద్ధికి అన్ని విధాలా పాటుపడతామన్నారు.

గుర్రప్పగారిపల్లెలో..

వీరబల్లి, ఏప్రిల్ 27 : మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. గుర్రప్పగారి పల్లెకు చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేశ్వరరాజు, వైసీపీ నాయకులు హరిరాజు, రామయ్య రాజు, కత్తర్ మస్తాన్, కొత్తవడ్డిపల్లెకు చెందిన 50 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ప్రసాద్‌బాబు కండువాలు వేసి వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు సుగవాసి బాల సుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన తొగటపల్లి, సీటీకే.హరిజనవాడ, గుర్రప్పగారిపల్లెల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయనకు అభిమానులు, కార్య కర్తలు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంత రం ఆయన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజు నాయకులు రెడ్డప్పరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, అమరేశ్వరరాజు, చలపతి నాయుడు, మట్లి సర్పంచ్ నాగార్జున ఆచారి, ఆంజ నేయులు రెడ్డి, భూషయ్య నాయుడు, దుర్గం అంజనేయులు, నేటి రమేష్, గుదే నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం

● జనసేన తిరుపతి నియోజకవర్గ పరిశీలకుడు అతికారి కృష్ణ

రాజంపేట, ఏప్రిల్27 : రాజంపేటను అన్ని రకాలుగా సర్వనాశనం చేసిన వైసీపీఅభ్యర్థి సుగవాసి బాల సుబ్ర మణ్యం, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని రాజంపేట జనసేన నేత, తిరుపతి ఎన్నికల పరిశీలకులు అతికారి కృష్ణ తెలిపారు. శనివారం రాజంపేట ప్రాంతంలో పెద్దఎత్తున కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటలో వైసీపీ నేత లు చేసిన ఇసుక దోపిడీ అంతాఇంతా కాదని, అందువల్లే అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు తెగిపోయి 40 మంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యాయన్నారు. పదులకొద్దీ గ్రామాలు నీట మునిగినా, బాధితులకు ఇంతవరకు ఇళ్ల కట్టించలేదని, రైతులకు భూములు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు జిల్లా కేంద్రం కాకుండా చేసి, మెడికల్ కళాశాల రాకుండా చేసి, ఒక్క అభివృద్ధి పని, ఒక్క సిమెంటు రోడ్డును కూడా వేయకుండా వైసీపీ నాయకులు ఓట్లు అడగడం సిగ్గు చేటన్నారు. వారికి రాజంపేటలో ఓటు అడిగే నైతిక హక్కు కూడా లేదన్నారు. రాజంపేట నియోజకవర్గ ప్రజలు రాజంపేటలో ఎప్పుడో వైసీపీని తరిమికొట్టారన్నారు. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో సుగవాసి బాలసుబ్రమణ్యం, కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపొందడం నల్లేరుపై నడకేనన్నారు.



రాజంపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న జనసేన తిరుపతి పరిశీలకుఢు అతికారి కృష్ణ

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

● కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులు ఓం ప్రకాష్ బంకర్, దిల్‌నవాజ్ అహమ్మద్

చిట్వేలి, ఏప్రిల్ 27 : ప్రజలు నిర్భయంగా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించు కోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకుడు ఓం ప్రకాష్ బంకర్, దిల్‌నవాజ్ అహమ్మ ద్ కోరారు. శనివారం మండల పరిధిలోని సి.కందులవారిపల్లె మిట్టపల్లి హరిజనవాడలో పర్యటించి ఓటర్లతో మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీ లిస్తున్నామన్నారు. భయాందోళనలు వీడి ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మోహన్‌రావు, కోడూరు నియోజకవర్గం ఎన్నికల అధికారి లీలారాణి, తహశీల్దారు జ్ఞానేశ్వరి, సీఐ , ఎస్ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

గాలివీడు, ఏప్రిల్27: ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని లక్కిరెడ్డిపల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవన్ గంగానంద్‌బాబు సూచించారు. ఆయన స్థానిక ఎస్ఐ వెంకటప్రసాద్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. క్షక్ష్యలకు, కార్పణ్యాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఎవరైనా అల్లర్లకు, గొడవలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయడానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అంజిరెడ్డి, పోలీసులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు మద్యం స్టాకును పరిశీలించాలి

గాలివీడు, ఏప్రిల్ 27: ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్‌లు మద్యం స్టాకును ప్రతిరోజు తనిఖీ చేస్తే పొరపాట్లకు తావుండదని అన్నమయ్య జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నోడల్ అధికారి చంద్రానాయక్ సూచించారు. శనివారం మండలంలోని మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మద్యం నియంత్రణ కోసం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి, పోలీస్ ఎస్ఐ గాయత్రి, జీఎస్‌టీవో అధికారి హేమంత్‌కుమార్‌తో పాటు టీం సభ్యులు సుధాకర్, విజయ్, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడికి తీవ్ర గాయాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 27 : మండల పరిధిలోని సాలాబాదు క్రికెట్ గ్రౌండ్‌లో తీవ్ర గాయాలతో పడి ఉన్న ఓ వ్యక్తిని శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. వారు అందించిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితుడు సిద్దవటం ఎగువపేటకు చెందిన మౌలాలి షేక్‌గా గుర్తించారు. వెంటనే అతనిని రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించినట్లు సీఐ పురుషోత్తం రాజు తెలిపారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, అతనిని ఎవరు కొట్టారు, ఏదైనా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నామని, గాయాలైన వ్యక్తికి 12 సంవత్సరాల క్రితం వివాహమైందని భార్యతో కూడా సఖ్యత లేదన్న విషయం విచారణలో తేలిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నామన్నారు.

కూటమితోనే అన్ని వర్గాల అభివృద్ధి

చిట్వేలి, ఏప్రిల్ 27 : ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి చివరికి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి ముక్కారూపానందరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మండల పరిధిలోని సీఎంరాచపల్లె, హరిజనవాడ, కొండయ్యగారిపల్లె, అలివేలు మంగాపురం గ్రామాల్లో, రైల్వే కోడూరు మండలం ఎగువపల్లె, దిగువపల్లె, ఎస్ టి కాలనీ, అబ్బిరాజుగారిపల్లె, పందెటిపల్లె, పొట్టిరాజుగారిపల్లె, చంగల్‌రాజుపల్లె, వి.పి.ఆర్.కండ్రికలో రైల్వేకోడూరు కూటమీ అభ్యర్థి అరవ శ్రీధర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అరాచక పాలన అంతం.. కూటమి పంతం!

● పెత్తందారీ పాలనలో రాష్ట్రం విధ్వంసం ● మండిపల్లిఆధ్వర్యంలో ఎన్డీఏ చార్జిషీట్ విడుదల

రాయచోటిటౌన్, ఏప్రిల్27: అరాచక పాలన అంతానికి ఎన్డీఏ కూటమి పంతం. జగనాసుర రక్త చరిత్ర, పెత్తందారీ పాలనలో రాష్ట్రం విధ్వంసం అనే నినాదాలతో ఎన్డీఏ సిద్ధం చేసిన చార్జిషీట్‌ను పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రవీంద్రారెడ్డి, ఏనుగుల విశ్వనాథ్ రమణారెడ్డి, ఎజాజ్‌ఖాన్, రెడ్డెయ్య తదితరులతో కలిసి రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి, అక్రమాలు, అరాచకాలు, మద్యం, డ్రగ్స్, ఇసుక, మట్టి మాఫియా విపరీతంగా పెరిగి పోయాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని ఏ వర్గానికి న్యాయం చేయలేదని ఆరోపించారు. వైసీపీ హయాంలో విద్యుత్, బస్సులు చార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరగడంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. మైనార్టీలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశాడని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించడం ద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకొని రాష్ట్రాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.



చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గాజుల ఖాదర్‌బాషా తదితరులు

60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



రాంప్రసాద్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

రామాపురం, ఏప్రిల్27: మండలం లోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లికి చెందిన వైసీపీ సీనియ ర్ నాయకుడు పప్పిరెడ్డి సహదేవ రెడ్డి ఆయన అనుచరులు, కట్ట కింద హరిజనవాడకు చెందిన బండపల్లి అన్నయ్య మరో 60 కు టుంబాలు శనివారం మాజీ ఎ మ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్య ర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి . పార్టీలో చేరిన వారిలో పప్పిరెడ్డి సహదేవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రఘునాథరెడ్డి, జయ రామ్‌రెడ్డి, గంగిరెడ్డి, ఇరుగులరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆంజనేయరెడ్డి, మరో 30 కుటుంబాలు హరిజనవాడకు చెందిన బండపల్లి అన్నమయ్య, చిన్నయ్య, శెట్టిపల్లె వెంకట్రమణ, కృష్ణయ్య, చంద్ర, ఎద్దుల ఆంజనేయులు, మరో 30 కుటుంబాలు శనివారం టీడీపీలో చేరారు. అనంతరం గొల్లపల్లిలోని హరినాథ్‌రెడ్డి ఇంట్లో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రజలు భారీ మెజారీ తో గెలిపిస్తారన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీవైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని త్వరలో జరగ నున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు విజయం సాధిస్తాయని రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీకాంత్‌రెడ్డి 15 ఏళ్లు, ఆయన తండ్రి ఐదేళ్లు ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గంలోని ఏ మండలంలోనైనా ఎలాంటి అభివృద్ధి జరగలేదని అభివృద్ధి కోసం ప్రజలు టీడీపీవైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రమేశ్‌రెడ్డి, అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, పప్పిరెడ్డి సహదేవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నెర్సుపల్లి సంజీవ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఇరుగుల్‌రెడ్డి పక్కీరారెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, ఖాదర్‌వలి, తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఊపందుకున్న ప్రచారం

సంబేపల్లె/రాయచోటి టౌన్, ఏప్రిల్27: టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలంటూ రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ, అక్కలు శ్రీలత, శ్రీవిద్య శనివారం శెట్టిపల్లె, దొడ్డి సిద్దయ్యగారిపల్లె, వల్లగొండపల్లి, కొండకిందపల్లె, దిన్నెమీదపల్లె, మర్రిమాకులపల్లె, నూతనగడ్డల్లో ఇంటింట ప్రచారం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, నారాయణరెడ్డి ఎనలేని సేవలందించారన్నారు. వారి వారసుడైన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని ఆయనతోనాటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని. ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు తెలియజేశారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కోసం ఒక పైసా ఖర్చు పెట్టలేదన్నారు. అవినీతి, అరాచక పాలనతో ఓటర్లు విసిగి పోయారని, ఓటు అనే ఆయుధంతో ఎన్నికల్లో శ్రీకాంత్‌రె డ్డికి, జగన్ ప్రభు త్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మల్లు విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగరాజునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, నాయకులు నూరెకరాల రంగారెడ్డి, ఖాదర్‌బాషా, నాగార్జునరెడ్డి, రెడ్డెయ్య, శివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీలతమ్మ, మండిపల్లి రాహుల్ రెడ్డి 20,21 వార్డులలో ప్రచారం చేశారు.



ప్రచారం చేస్తున్న మండిపల్లి కుటుంబీకులు



'స్మార్ట్' క్యాంపెయిన్

ట్రెండ్

అభ్యర్థులకిప్పుడు ఇల్లిల్లూ తిరగాల్సిన అవసరం కూడా ఉండడంలేదు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు సైతం జండా భుజాన మోసి అలసిపోనూ అవసరం లేదు. స్మార్ట్ క్యాంపెయిన్ ఊపందుకుంది. అయిదేళ్ల కిందటితో పోలిస్తే ప్రచార వ్యూహాల్లో సోషల్ మీడియా వినియోగం మూడింతలు పెరిగిపోయింది. ఫేస్‌బుక్ లైవ్‌లు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి. ఓ మాదిరి స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. ప్రచారం హోరెత్తించేస్తున్నారు. కుప్పంలో వైసీపీ రెబెల్‌గా నామినేషన్ వేసిన అధికార పార్టీ సర్పంచి భార్య నీలమ్మ అలియాస్ నీలావతి, ఇటీవల ఫేస్‌బుక్‌లో లైవ్‌లోకి వచ్చేశారు. నియోజకవర్గంలో అయిదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు. తనను గెలిపిస్తే పరిశ్రమలు తెచ్చేసి మహిళలు బెంగళూరు వలస వెళ్లకుండా చూస్తానని హామీ ఇచ్చేశారు. మళ్లీ ఈ ఫేస్‌బుక్ లైవ్‌ను వాట్సాప్‌తోపాటు ఇతర సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ఏదో ఓ సమయంలో వీలు చూసుకుని ఇలా ఫేస్‌బుక్ లైవ్ షోలు చేస్తున్నారు. లేదా తమ ఆలోచనలు, హామీలతో వీడియోలను చేసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం 'స్మార్ట్'గా విపరీతమైన ప్రచారం కొట్టేస్తున్నారు. ఇక ప్రధాన పార్టీల వీరాభిమానులైతే ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్.. ఇలా వారు తమ పార్టీ అభ్యర్థుల ప్రచారంకోసం సామాజిక మాధ్యమాలను వాడుతున్నారు. ఖర్చు తక్కువ.. ప్రచారం ఎక్కువగా జరిగే స్మార్ట్ క్యాంపెయిన్లతో అభ్యర్థులు దూసుకు పోతున్నారు.

- కుప్పం

చామంతిపురం రిజర్వాయర్ ఏమైంది స్వామి?

నెరవేరని హామీ

● మూడేళ్లయినా ఊసే లేని వైనం

పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద రూ.3 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలి. దీంతో చిత్తూరు నగరంతో పాటు పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుతుంది.

- 2020 అక్టోబరు 19న చిత్తూరు కలెక్టరేట్‌లో అధికారులతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సమావేశమై ఆదేశించారు.

పూతలపట్టు, ఐరాల మండలాల సరిహద్దులో ఈ చామంతిపురం రిజర్వాయర్‌ను 5 టీఎంసీల సామర్థ్యంతో రూ.3 వేల కోట్లతో నిర్మించాలనుకున్నా.. దీన్ని ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. అధికారులు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేదు. దీన్ని నిర్మించి అక్కడికి ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలు తెస్తామని.. లేదంటే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి వచ్చే నీళ్లతోనైనా నింపుతామన్నారు. వాస్తవానికి జిల్లాలో ఒక్కటీ పెద్ద రిజర్వాయర్ లేదు. ఒక జలాశయం అందుబాటులో ఉంటే నీటిని నిల్వ చేసుకుని, ఎద్దడి పరిస్థితులను ఎదుర్కోవచ్చు. మూడున్నరేళ్లు పూర్తవుతున్నా దీని నిర్మాణానికి సంబంధించి నయా పైసా నిధులు విడుదల కాలేదు. ప్రాథమికంగా సర్వే చేయడానికి రూ.10 కోట్లవుతుందని యంత్రాంగం నారాయణస్వామికి సూచించగా, రూ.5 కోట్లు విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఫలితం లేదు. రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని చిత్తూరు నగరానికి కేటాయించి.. మరో నాలుగు టీఎంసీలతో పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చవచ్చు. అలాగే పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

- పూతలపట్టు



'గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు నిర్మిస్తే.. నేను ఊళ్లనే నిర్మిస్తాను' అంటూ సీఎం జగన్ చెప్పారు. లబ్ధిదారుల కోసం ఊరికి దూరంగా.. కొన్ని చోట్ల కొండల్లో గుట్టల్లో లే అవుట్లు వేశారు. గ్రామాల్లో ఒకటిన్నర.. పట్టణాల్లో సెంటు స్థలాలు ఇచ్చారు. ఇంటికేమో రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర నిధులే సరిపెట్టారు. లబ్ధిదారులపై ఒత్తిడి చేసి.. బలవంతంగా ఇళ్ల నిర్మాణం చేయించారు. దీంతో వారంతా అప్పులపాలయ్యారు. జగనేమో తాను ఊళ్లను కడుతున్నానంటూ 'జగనన్న కాలనీ'లుగా పేరు పెట్టుకున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జమీందారుల కోట

పుంగనూరు చరిత్ర



పుంగనూరు అంటే జమీందారులు గుర్తుకొస్తారు. ఒకనాడు పాలన సాగించిన రాజకీయ ఉద్దండులూ జ్ఞాపకానికి వస్తారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత నాటి ప్రశాంతత దూరమై.. రాజకీయ కక్షలు, అక్రమాలు, దౌర్జన్యాలతో రాష్ట్రవ్యాప్తంగా పేరు పొందింది. పూర్వపు పుంగనూరు నియోజకవర్గం.. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పెద్దపంజాణి, రామసముద్రం మండలాలతో, 35 కిలోమీటర్లలోపు విస్తీర్ణంతో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత దీని విస్తీర్ణం 120 కిలోమీటర్లకు విస్తరించింది. తమిళం, కన్నడ ప్రజలూ ఇక్కడ స్థిరపడ్డారు. 1952లో మొదలై ఇప్పటికి 17 మార్లు ఎన్నికలు జరిగాయి. అందులో రెండు ఉప ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ 9 సార్లు, తెలుగుదేశం పార్టీ ఆరు పర్యాయాలు, వైసీపీ రెండు సార్లు, స్వతంత్ర్య అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. 11 మంది ఎమ్మెల్యేలు అయ్యారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో సామాన్యుడైన బస్సు కండక్టర్ బగ్గిడి గోపాల్ ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. 1955, 1970, 1972ల్లో ఎమ్మెల్యేలుగా జమిందారీ కుటుంబీకులు ఎన్నికయ్యారు. ఇక, ఎమ్మెల్యేగా, చిత్తూరు ఎంపీగా హ్యాట్రిక్ సాధించిన నూతనకాల్వ రామకృష్ణారెడ్డి రాజకీయ ప్రస్థానం ఈ నియోజకవర్గం నుంచే మొదలైంది. తండ్రీ కొడుకులుగా రామకృష్ణారెడ్డి, అమరనాథరెడ్డి ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. ఈ ఐదేళ్లలో అరాచకాలు, దౌర్జన్యాలు, పోలీసు కేసులు, రౌడీషీట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా పోలీసుల సహకారంతో వైసీపీ శ్రేణులు అడ్డుకోవడం వంటి ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా పేరు పొందింది.

ఎమ్మెల్యేలు వీరే..

- 1952- బాదాల కృష్ణమూర్తి (కాంగ్రెస్)
- 1955- వైజీ.వీరబసవ చిక్కరాయులు (స్వతంత్ర)
- 1955- ఎంఎం.రత్నం (కాంగ్రెస్)
- 1962, 1967-వి.రామస్వామిరెడ్డి (కాంగ్రెస్)
- 1970 ఉప ఎన్నిక- బి.రాణీసుందరమ్మణి (కాంగ్రెస్)
- 1972- బి.రాణీసుందరమ్మణి (కాంగ్రెస్)
- 1978- కేవీ పతి (కాంగ్రెస్-ఐ)
- 1983- బగ్గిడి గోపాల్ (టీడీపీ)
- 1985, 1989, 1994 - ఎన్.రామకృష్ణారెడ్డి (టీడీపీ)
- 1996 ఉప ఎన్నిక- ఎన్.అమరనాథరెడ్డి(టీడీపీ)
- 1999- ఎన్.శ్రీధర్‌రెడ్డి (కాంగ్రెస్)
- 2004- ఎన్.అమరనాథరెడ్డి (టీడీపీ)
- 2009- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (కాంగ్రెస్)
- 2014, 2019- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ)

మండలాలు: పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల

ఓటర్ల సంఖ్య : 2,37,719

పురుషులు : 1,16,504

మహిళలు : 1,21,210

ఇతరులు : 05

- పుంగనూరు



మోసం గురూ!

ఊళ్లను నిర్మించడమంటే

ఇదేనా జగన్?





- కొండల్లో, గుట్టల్లో లేఅవుట్లు
- మౌలిక వసతుల కరువు
- ఇల్లుకట్టుకున్నా నివాసం ఉండలేక అవస్థలు
- కేంద్రం సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం సోకులు

జిల్లాకు 73,584 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 46,374 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మంజూరై నాలుగేళ్లవుతున్నా 3082 మంది లబ్ధిదారులు ఇంకా నిర్మాణాలను ప్రారంభించలేదు. 3560 మంది పునాది గుంతలు తవ్వి వదిలేయగా.. 10,948 మంది పునాదులు వేసుకున్నరు. 5,334 మంది గోడలు.. 4,286 మంది స్లాబులను వేసుకున్నారంతే. ఆసక్తి చూపకపోవడానికి కారణం యూనిట్ కాస్ట్ చాలకపోవడం. టీడీపీ హయాంలో కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇచ్చేది. అప్పటి ధరలకు ఈ రూ.2.5 లక్షలకు అదనంగా మరో రూ.లక్ష వేసుకుంటే ఇల్లు సిద్ధమైపోయేది. ఇప్పుడు.. కరోనా తర్వాత నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోయాయి. ఊళ్లను కడతానన్న జగన్.. తమ ప్రభుత్వ వాటాగా పైసా కూడా ఇవ్వలేదు. కేంద్రం ఇంటికి ఇచ్చే రూ.1.5 లక్షలు, మరుగుదొడ్డికి అందించే రూ.30 వేల ఉపాధి నిధులనే తాను ఇస్తున్నట్లు కలరింగ్ చేస్తున్నారు. ఇప్పుడున్న ధరలతో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.6 లక్షలు అవుతోంది. దీంతో పేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు.

ఇక్కడ ఇళ్లు కట్టుకునేదెలా?



నగరి పట్టణంలోని పేదలకని ఏడు కిలోమీటర్ల దూరంలోని నాగరాజుకుప్పం, కీలపట్టుల్లో రెండు లేఅవుట్లు సిద్ధం చేశారు. కొండ ప్రాంతంలో ఉండడంతో చాలామంది నిర్మాణానికి చొరవ చూపలేదు. కేంద్రం ఇచ్చే రూ.1.8 లక్షలు కాకుండా, ఒక్కో లబ్ధిదారు వద్ద రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరుగుదొడ్లు, గోడలకు పూత పనులు, తలుపులు వంటివి అసంపూర్తిగా వదిలేశారు. ఇవన్నీ పూర్తి చేయాలంటే ఒకొక్కరు రూ.1.80 లక్షలు ఇవ్వాలని కాంట్రాక్టర్లు అడిగినట్లు ఓ మహిళ చెప్పారు. అంత ఇచ్చుకోలేక కొందరు వదిలేశారు. ఈ రెండు లేఅవుట్లలో 3556 ఇళ్లు మంజూరగా, 1978 పూర్తయ్యాయి. ఊరికి దూరంగా ఉండడంతో ఇక్కడ నివాసం ఉండేందుకు భయపడుతున్నారు.

నెరవేరని సొంతింటి కల

జిల్లాలో సుమారు 74 వేల మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. వీటిని ఆధార్‌తో అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొండల్లో, గుట్టల్లో, ఊరికి దూరంగా ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకోలేక.. కట్టుకున్నా నివాసం ఉండలేకున్నారు. ఎందుకంటే.. ఊరికి దూరంగా కాపురం వెళితే బతుకుతెరువు కోసం నిత్యం పట్టణానికి రావాలంటే వ్యయప్రయాసలు కాబట్టి. అందుకని అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నారు. ఇళ్లు కట్టుకోకున్నా ప్రస్తుతం వీరు లబ్ధిదారులు కావడంతో.. భవిష్యత్తులో ప్రభుత్వాలు అనువైన చోట ఇళ్ల స్థలాలు ఇచ్చినా.. వీరు అనర్హులవుతారు. ఇలా సొంతింటి కల నెరవేరని పరిస్థితి. అందుని కొందరు లబ్ధిదారులు పనికిరాని పట్టాలు తమకొద్దని, రద్దు చేయాలని కోరుతున్నారు.






అప్పు చేసే స్థోమత లేక..

ఈమె పేరు మేరీ. బంగారుపాళ్యం మండలం ముంగరమడుగు గ్రామం. ఈమెకు పక్కా గృహం మంజూరైంది. తొలుత పునాది బిల్లు రూ.70 వేలు, తర్వాత గోడ బిల్లు రూ.35 వేలు, 50 బస్తాల సిమెంటు వచ్చాయి. అప్పు చేసి స్లాబు వేసుకున్నారు. ఆరు నెలలవుతున్నా బిల్లులు రాలేదు. ఇప్పటివరకు ఇటుకల కోసం రూ.లక్ష, మేస్త్రి కూలి కోసం రూ.1.10 లక్షలు ఖర్చయినట్లు ఆమె తెలిపారు. ఇంకా గోడలకు పూత పని, తలుపులు, కిటికీలు అమర్చలేదు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం చాలడం లేదని, మరో రూ.3 లక్షలు చేతి నుంచి పడుతోందని, స్థోమత లేక నిర్మాణం ఆపేసినట్లు ఆమె చెప్పారు.

ఊరికి దూరంగా.. మౌలిక వసతుల్లేక

ఇది వి.కోట మండలం పాపేపల్లి-3 జగనన్న లేఅవుట్. ఇక్కడ 400 మందికి ఇళ్లు మంజూరైతే 50 మంది నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. వీరిలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ లేఅవుట్ వి.కోటకు మూడు కిలోమీటర్ల దూరంగా.. మెయిన్ రోడ్డు నుంచి కిలోమీటరు లోపలకు ఉంది. దీంతో ఇక్కడ నివాసం ఉండేందుకు మహిళలు భయపడుతున్నారు. ఈ కాలనీలో అంతర్గత రహదారుల్ని నిర్మించలేదు. మౌలిక వసతులు కల్పించలేదు.



వడ్డీలు కట్టలేక..

ఈమె పేరు జయశ్రీ. పెనుమూరు మండలం చిన్నకలికిరి గ్రామం. ఈమెకు పక్కా గృహం మంజూరు కావడంతో రూ.2 లక్షలు అప్పుచేసి చకచకా స్లాబు వరకు పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం నుంచి రూ.70 వేలు పునాది బిల్లు కూడా వచ్చింది. ఆరు నెలలుగా గోడలు, మోల్డింగ్ బిల్లులు రాలేదు. సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో ఇంటి తుది మెరుగులు దిద్దలేక, అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.





అసంపూర్తి ఇంట్లోనే నివాసం

ఈమె పేరు సల్మా. వి.కోట మండలంలోని పాపేపల్లి-3 జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వ గృహాన్ని నిర్మించుకున్నారు. రూ.1.80 లక్షల బిల్లు పూర్తిగా వచ్చేసింది. చేతి నుంచి రూ.3 లక్షలు వేసుకుని నిర్మాణం పూర్తి చేసుకున్నారు. మరో రూ.లక్ష ఉంటే తుది మెరుగులు చేసుకోవచ్చు. ఇక అప్పులు చేయలేక వదిలేశారు. ఆ అసంపూర్తిగా ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. వి.కోటకు దూరంగా లేఅవుట్ ఉండడంతో రాత్రిళ్లు భయపడుతూ జీవనం సాగిస్తున్నారు.

కుప్పం వర్తమానం

'భువన' సారథ్యం!

నిన్నా మొన్నటిదాకాలో ప్రొఫైల్ మెయిన్‌టైన్ చేశారు. ఎప్పుడైతే తన భర్తను కేసుల్లో ఇరికించి జైలుపాలు చేశారో, అప్పుడు 'నిజం గెలవాలి' పేరుతో లైమ్‌లైట్‌లోకి వచ్చారు. రాష్ట్రమంతా పర్యటించి.. పార్టీ శ్రేణులకు నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. ఎన్నికల వేళ చంద్రబాబు బిజీగా ఉండటంతో.. ఆయన తరపున కుప్పంలో పార్టీకి సారథ్యం వహిస్తున్నారు నారా భువనేశ్వరి. హైదరాబాదు నుంచి ఆమె పర్యవేక్షిస్తున్నారు.

- కుప్పం

గతేడాది చివర్లో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున క్లినిక్ ప్రారంభోత్సవానికి నారా భువనేశ్వరి కుప్పం వచ్చారు. అప్పుడు రాజకీయాల గురించి అడిగితే వాటి గురించి తనకు తెలియదని చెప్పారు. అదే ఆమె.. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గత నెల 20, 21 తేదీలలో ఇక్కడ పర్యటించినప్పుడు రాజకీయాల గురించి మాట్లాడాల్సిన అనివార్య పరిస్థితి స్థానికంగానే కాకుండా, రాష్ట్రమంతటా ఏర్పడింది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుడుపల్లె మండలంలో ఇద్దరు అభిమానులు చనిపోయారు. ఆ కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున రూ.3 లక్షల చెక్కు అందించారు. బాధిత కుటుంబాల బిడ్డల బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. మహిళలతో జరిగిన ముఖాముఖిలో పాల్గొన్నారు. వైసీపీ పాలనలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి టీడీపీ అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు బిజీగా మారిపోయారు. నారా లోకేశ్ సైతం తీరికలేని పార్టీ కార్యక్రమాలలో తలమునకలయ్యారు. ఈ క్రమంలో చంద్రబాబు నియోజకవర్గ సారథ్య బాధ్యతలను క్రమేణా భువనేశ్వరి తీసుకుంటూ వచ్చారు. తాను నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నా అక్కడి నుంచే పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయసాగారు. ఈనెల 19వ తేదీన చంద్రబాబు తరఫున నామినేషన్ వేయడానికి కుప్పం వచ్చారామె. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి జనం వేలాదిగా వచ్చారు. రెండు రోజులపాటు మహిళలు, ప్రతిభావంతులు, ముస్లిం మైనారిటీ సోదరులు.. ఇలా ప్రతివర్గంతోనూ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. వైసీపీ అరాచకాలపై నిప్పులు చెరిగారు. పార్టీ కేడర్‌పై అన్యాయంగా బనాయించిన అక్రమ కేసులను ప్రస్తావించారు. తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీలో కష్టపడిన ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. అత్యధిక మెజారిటీ సాధించే పోలింగ్‌బూత్ ఉన్న ప్రాంతాన్ని తాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

హైదరాబాదు నుంచే పర్యవేక్షణ

హైదరాబాదులో ఉంటున్నా.. కుప్పంలో పరిస్థితులను భువనేశ్వరి తెలుసుకుంటున్నారు. ఇటీవల తంబిగానిపల్లెలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ద్వారా ఆమె ఫోనులో పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఓసారి కుప్పం వస్తానని అవసరమైతే బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు రాష్ట్రమంతా చూసుకోవాల్సి రావడంవల్ల భువనేశ్వరి తన సమయాన్ని కుప్పంలో పార్టీకోసం కేటాయించారు. లక్ష మెజారిటీ లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.



ఈనెల 19న చంద్రబాబు తరపున నామినేషన్ వేసే సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి (ఫైల్ ఫొటో)

మరోవైపు తన బిజీ షెడ్యూల్‌లో వెసులుబాటు తీసుకుని చంద్రబాబు కూడా ఇక్కడి కేడర్‌ను పలకరిస్తున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తున్నారు. మొన్న రామకుప్పంలో పోలీసు అధికారి బాధితులను ఫోనులో పలకరించి ధైర్యం చెప్పారు.

వాహనానికి నిప్పంటించడం దుర్మార్గం



పీలేరు సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు



కలకడలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్, కూటమి నాయకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 27: వాల్మీకిపురం మండలం విఠలం గ్రామం వద్ద టీడీపీ ప్రచార రథాన్ని కాల్చివేయడం దుర్మార్గం, ఈ ఘటన వైసీపీ నాయకుల పిరికిపంద చర్య అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం మండలంలో కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి తనూజరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని, రెండులో రోజులుగా ఆమెకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్నారు. ఇదంతా చూసి భయపడిన వైసీపీ నాయకులు ఆడవారిని బయపెట్టాలని కుందేలువారిపల్లె నుంచి చింతపర్తికి వెళుతున్న టీడీపీ ప్రచారం రథంపై ఇద్దరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారన్నారు. ఈ ఘటనలో డ్రైవర్ బాబాచారి తీవ్రంగా గాయపడ్డారన్నారు. సౌమ్యులుగా పేరున్న నల్లారి కుటుంబం ఈఘటనను సీరియస్‌గా తీసుకుందని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి ఇద్దరు దుండగులు, వారి వెనుక ఉన్న బడా నాయకులను అరెస్టు చేయాలన్నారు. పీలేరు ఎమ్మెల్యే చింతల కనుసన్నల్లోనే ఈ ఘటన జరిగివుంటుందని ఆర్‌జే వెంకటేశ్ ఆరోపించారు. దమ్ముధైర్యం వుంటే నిజాయితీ రాజకీయాలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్, అన్వర్ బాషా, దుర్గాప్రసాద్, శివకృష్ణ, రామన్న, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కలకడలో: వాల్మీకీపురం మండలం విఠలం వద్ద టీడీపీ ప్రచార వాహనానికి దుండగులు నిప్పంటించడం దుర్మార్గమైన చర్య అన్ని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం ఆయన కలకడ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పూర్వపు వాయల్పాడు, 2009 నుంచి పీలేరు నియోజకవర్గాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రశాంతంగా ఎన్నిలకు జరిగేవన్నారు. 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమాయక ప్రజలపై అక్రమ కేసులు బనాయించడం, దాడులు జరపడం సర్వసాధారణమన్నారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే ప్రజాస్వామ్యా హక్కులను కాలరాస్తున్నారన్నారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులనాయుడు, ఈశ్వరయ్య, ఆనంద్‌రెడ్డి, ఫీరయ్య, మహల్ మహ్మద్ అలీ, జిలానీ, నౌషాద్, ఖాజా, ఇమ్రాన్, ఇర్ఫాన్, ప్రసాద్‌నాయుడు, రెడ్డెప్ప, వెంకరమణ, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.



మదనపల్లెలో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

పీలేరులో: వాల్మీకిపురం మండలం విఠలం వద్ద టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ మూకలు దహనం చేయడం దారుణమని పీలేరులోని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పీలేరులోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని అప్రజాస్వామిక పద్ధతులను వైసీపీ నాయకులు ప్రోత్సహించడం సహేతుకం కాదన్నారు. ప్రచార రథం దహనం వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ మల్లెల రెడ్డిబాషా మాట్లాడుతూ వలంటీర్లపై చంద్రబాబు నాయుడు మాట్లాడిన తరువాత వైసీపీ నాయకులు వారిచేత రాజీనామాలు చేయించి తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు యల్లెల రెడ్డప్పరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, పురం రామ్మూర్తి, ఆర్‌బీఐ రమణారెడ్డి, స్పోర్ట్స్ మల్లి, హనీఫ్, రహంతుల్లా, గాండ్ల విజయ్ కుమార్, మహమ్మద్‌పీర్, ఫర్హత్ అలీ, సందీప్, వెంకటరమణ నాయక్, బుజ్జు, జయన్న, షౌకత్ అలీ, అతార్ చాను, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ప్రశాంతంగా పాలీసెట్



పాలిసెట్‌ను పర్యవేక్షిస్తున్న జీఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేశ్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 27: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలీసెట్ ప్రశాంతంగా జరిగాయి. శనివారం ప్రభుత్వ మోడరన్ రెసిడెన్షియల్ (జీఎంఆర్) పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేశు ఆధ్వర్యంలో పట్టణంలో రెండు సెంటర్లలో పాలిసెట్ నిర్వహించారు. స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో 1642 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి వుండగా 1433 మంది హాజరయ్యారు. పరీక్ష సమయానికి ఒక గంట ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా వారిని పోలీ సులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

మహిళ అదృశ్యం కేసు నమోదు

మదపనపల్లె అర్బన్, ఏప్రిల్ 27: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా స్టేషన్ సీఐ శేఖర్ తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ కాలనీకి చెందిన శివరాజు భార్య చంద్రప్రియా(20) ఈ నెల 24వ తేదీ నుంచి కనపడడంలేదని శివరాజు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండేళ్ల క్రితం కర్నాటక రాష్ట్రం, గౌనిపల్లె గ్రామం, కోడిపల్లెకు చెందిన చంద్రప్రియాను వివాహం చేసుకున్నట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. శనివారం మహిళపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

పీలేరు, ఏప్రిల్ 27: వాల్మీకిపురం మండలం విఠలం వద్ద టీడీపీ ప్రచార రథం దగ్ధం నేపథ్యంలో శనివారం పీలేరు పోలీసులు పట్టణ శివార్లలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. పీలేరు-మదనపల్లె మార్గంలోని బడబల్లవంక బ్రిడ్జి వద్ద వాహనాలను పీలేరు ఎస్‌ఐ నరసింహుడు నేతృత్వంలో తనిఖీ చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

కలకడ, ఏప్రిల్ 27:గ్రామాల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. శనివారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలకు సక్రమంగా తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అవకాశమున్న గ్రామాలకు ఝరికోన నీటి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎంసీసీ అమలులో ఉన్నందున్న కొత్త బోర్లకు అనుమతి లేదన్నారు. అలాగే వేసవి వ్యాధుల బారీన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించండి

● ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కవిత ఎస్ మన్నికేరి



కలికిరిలో ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న పరిశీలకురాలు కవిత ఎస్ మన్నికేరి

పీలేరు/కలికిరి ఏప్రిల్ 27: ఎన్నికల విధుల్లో నిష్పక్ష పాతంగా, అప్రమత్తంగా వ్యవహరించాలని పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల సాధారణ పరిశీలకురాలిగా నియమితులైన కర్ణాటక ఐఏఎస్ అధికారిణి కవిత ఎస్.మన్నికేరి బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. పీలేరు నియోజకవర్గం కోసం పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగు రూము, పీలేరు తహసీల్దారు కార్యాలయా న్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతూ పో లింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు ఉండేటట్లు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంతకు మునుపు ఆమె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగు రూమును పరిశీలించారు. పోలింగ్ ముందు రోజు ఎన్నికల సామగ్రి పంపిణీ సజావుగా, సకాలంలో ముగిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఆర్‌వో మహబూబ్ బాషా, ఏఎస్‌వో రామ్మోహన్, డీటీ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ చాణక్య పాల్గొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన ఎన్నికల గుర్తులేవీ పోలింగ్ కేంద్రాల్లో కబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకురాలు కవిత మన్నికేరి స్పష్టం చేశారు. కలికిరి రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల గుర్తులతో పోలికలుండే ఎలాంటి చిహ్నాలు వుండరాదన్నారు. సమావేశంలో లైజనింగ్ అధికారి సయ్యద్ అహ్మద్, తహసీల్దారు విజయకుమారి, ఇన్‌స్పెక్టర్ మోహన్, ఎంపీడీవో రామకృష్ణ, సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నా కొడకా..నువ్వు తిరుగుతావేం రా..

● వైసీపీ వారు బెదిరించారంటూ రాజంపేట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బషీద్ ఆవేదన

● వైసీపీని ఓడించకపోతే ఎవరి ప్రాణానికి గ్యారంటీ లేదని వ్యాఖ్య



బి కొత్తకోటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బషీద్

బి.కొత్తకోట, ఏప్రిల్27: రేయ్ నా కొడకా.. ఇక్కడ నువ్వు తిరుగుతావేం రా..నువ్వు నాన్ లోకల్, ఇక్కడ ఎలా పోటీ చేస్తావ్ రా..నీ కథ చూస్తామంటూ అధికార వైసీపీ నాయకులు తనను బెదిరించారని రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ బషీద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం క్యాడర్‌ను సన్నద్ధం చేయడంలో భాగంగా శనివారం ఆయన బి.కొత్తకోటలో పర్యటించారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభ్యర్థి ఎంయన్ చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుల వ్యవహారశైలి పై మండిపడ్డారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఎక్కడ సమస్య వున్నా వెంటనే స్పందిస్తామన్నారు. వైయస్ షర్మిల నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆస్తులు, సహజవనరుల రక్షణ కోసం వైసీపీ ని ఓడించాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లాబకష్, క్రిష్ణారెడ్డి, రవూఫ్, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాథ్, బషీర్ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదపనల్లె అర్బన్‌లో: మదపనల్లె కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి శనివారం పట్టణంలోని దర్గాలో ప్రచారం నిర్వహించారు. ముస్లింలను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కేబాషా, మల్లెల నరేంద్ర, మహబూబ్‌పీర్, మహమ్మద్‌అలీ, సయ్యద్, నాగరాజ పాల్గొన్నారు.

కురవంకలో టీడీపీ ముమ్మరంగా ప్రచారం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27: మండలంలోని కురవంకలో టీడీపీ నాయకులు శనివారం కూటమి అభ్యర్థి ఎం. షాజహాన్‌బాషాతో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ముందుగా కురవంక ఎంపీటీసీ బిల్లే హారతి, బిల్లే రెడ్డిప్రసాద్ స్వాగతం పలికారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, జనసేన నేత జంగాల శివరాం, మాజీ సర్పంచ్ మోహన్, బిల్లేరెడ్డిప్రసాద్, మైనార్టీ నేత ఎస్‌ఏ మస్తాన్, దొరస్వామినాయుడు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. దీంతో కురవంకలో టీడీపీ ప్రచారం జోరెత్తుకుంది.

ఉప్పొంగిన అభిమానం..



నిమ్మనపల్లి, ఏప్రిల్ 27: టీడీపీని గెలిపిచాలని చౌకిళ్ల వారిపల్లికి చెందిన సయ్యద్‌బాషా శనివారం తన కంటే పదింతలు పొడవాటి టీడీపీ జెండాను ఎత్తుకొని ప్రచారం చేపట్టాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడు తూ తనకు టీడీపీ అంటే ఎంతో అభిమానం అని ఈ సారి చంద్రబాబు ముఖ్యమం త్రి కావాలని తన వంతు ప్రచారం చేస్తున్నట్లు తెలిపాడు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించండి



కలిచెర్ల పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దమండ్యం, ఏప్రిల్ 27: ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలను పరిశీలించాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణయ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల, వెలిగల్లు, శివపురం, ఎస్‌వోపల్లి గ్రామాలలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో వికలాంగులు, వృద్ధుల కోసం ర్యాంప్, వీల్ చైర్ తప్పని సరిగ సౌకర్యం కల్పిం చాలన్నారు. అలాగే పోలింగ్ గది వెలుతురు కోసం విద్యుత్తు, కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం ఉండాలన్నారు. ఎన్నికల పోలింగ్ రోజు ముందుగానే మౌలిక సౌకర్యాలను సమకూర్చాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం వల్ల ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి నగదు తీసుకో పోకూడదన్నారు. ఎస్‌ఐ చెన్నకేశవ, ఏఎస్‌ఐ మధుసూధనాచారి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జనార్ధన, శేషాద్రి జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

● కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులు


చిట్వేలి, ఏప్రిల్ 27 : ప్రజలు నిర్భయంగా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించు కోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకుడు ఓం ప్రకాష్ బంకర్, దిల్‌నవాజ్ అహమ్మ ద్ కోరారు. శనివారం మండల పరిధిలోని సి.కందులవారిపల్లె మిట్టపల్లి హరిజనవాడలో పర్యటించి ఓటర్లతో మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీ లిస్తున్నామన్నారు. భయాందోళనలు వీడి ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మోహన్‌రావు, కోడూరు నియోజకవర్గం ఎన్నికల అధికారి లీలారాణి, తహశీల్దారు జ్ఞానేశ్వరి, సీఐ , ఎస్‌ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

గాలివీడు, ఏప్రిల్27: ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని లక్కిరెడ్డిపల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవన్ గంగానంద్‌బాబు సూచించారు. ఆయన స్థానిక ఎస్‌ఐ వెంకటప్రసాద్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కక్షలకు, కార్పణ్యాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఎవరైనా అల్లర్లకు, గొడవలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయడానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీసులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారు

● కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి





మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి, హాజరైన కూటమి నాయకులు, కార్యకర్తలు

ములకలచెరువు, ఏప్రిల్ 27: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసి వనరులను దోచుకున్నారని తంబళ్ళపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి విమర్శించారు. ములకలచెరువులోని కేజీఎన్ కళ్యాణమండపంలో శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులతో జరిగిన ఆత్మీయ సమావేశం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి పరిశ్ర మలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానన్నారు. బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాల ఇన్ చార్జులు రాందాస్‌చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయ కుడు నరేంద్రబాబుమాదిగ, టీడీపీ నేత కుడుం శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర నేత గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్దా, వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, టీఎస్ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామి నాయుడు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మాజీ జడ్పీటీసీ కువైట్ శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, మౌలా పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డి గెలవాలని పూజలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 27: తంబళ్లపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద స్వామి వారికి 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

ప్రతిరోజు మద్యం స్టాకును పరిశీలించాలి

గాలివీడు, ఏప్రిల్ 27: ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్ వైజర్‌లు మద్యం స్టాకును ప్రతిరోజు తనిఖీ చేస్తే పొరపాట్లకు తావుండదని అన్నమయ్య జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నోడల్ అధికారి చంద్రా నాయక్ సూచించారు. శనివారం మండలంలోని మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మద్యం నియంత్రణ కోసం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి, పోలీస్ ఎస్‌ఐ గాయత్రి, జీఎస్‌టీవో అధికారి హేమంత్‌కుమార్‌తో పాటు టీం సభ్యులు సుధాకర్, విజయ్, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వస్తే భూములను మింగేస్తారు..!

● ఓటమి భయంతోనే టీడీపీ ప్రచార రథాన్ని తగులబెట్టారు ● పీలేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్వజం



గుర్రంకొండ మండలం సరిమడుగులో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



వాల్మీకిపురంలో తనూజా రెడ్డిని గజమాలతో సత్కారం



కలికిరి మండలం మేడికుర్తిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

గుర్రంకొండ, ఏప్రిల్ 27:రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రైతుల భూములను కూడా మింగేస్తారని పీలేరు టీడీపీ, బీజేపీ. జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గుర్రంకొండ మండలంలోని నడిమిఖండ్రిగ, చెర్లోపల్లె, ఎల్లుట్ల, సంగసముద్రం, గుర్రంకొండ, సరిమడుగు, దౌలత్‌ఖాన్‌పల్లె, తల్లారివాండ్లపల్లె, ఖండ్రిగ గ్రామాల్లో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులకు తెలి సింది కబ్జాలు, దౌర్జన్యాలు, ఆక్రమణలు, దోపిడీలేనన్నారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీలకు ఓటమి భయం మొదలైందని దీంతో మతి భ్రమించి టీడీపీ ప్రచార రథాన్ని తగలబెట్టారని, బాధ్యులను వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. రాజంపేట పార్లమెంట్ ఉమ్మడి కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి, పీలేరు అభ్యర్థిగా తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ దినేష్, జగదీష్‌కుమార్, ఇంతియాజ్ అహ్మద్, మూర్తిరావు, నౌషాద్ అహ్మద్, మహత్మారెడ్డి, వై.ఆర్వీ.రెడ్డిప్రసాద్ నాయుడు, మేకల చలపతి, హరిప్రసాద్‌నాయుడు, నక్కాసతీష్, చలమారెడ్డి, మౌలా, వెంకటరమణ, తారక, రెడ్డిశేఖర్, చిన్నప్ప, సాగర్, ద్వారక, నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి వైసీపీ నాయకులు

గుర్రంకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పంచాయతీ పరిధిలోని మూడో వార్డు సభ్యుడు తిరువీధి నవీన్, ఒకటవ వార్డు సభ్యుడు ఖాజీ తాజుద్దీన్‌లతోపాటు 50 కుటుంబాలు, చెర్లోపల్లెకు చెందిన 10 కుటుంబాలు, సంగసముద్రంకు చెందిన 20 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరారు. వారందరికీ నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.

మేడికుర్తిలో ఇంటింటి ప్రచారం

కలికిరి, ఏప్రిల్ 27: రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేగా కిశోర్‌కుమార్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మేడికుర్తిలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లారి ఆనంద రెడ్డి, మాజీ జడ్పీటీసీలు చంద్రకుమార్ రెడ్డి, మాలతి, మాజీ సర్పంచులు లక్ష్మీకర్ రెడ్డి, శ్రీధర్, నిజాముద్దీన్, జనార్ధన్, సురేష్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్ర, జ్ఞానమూర్తి, వేణుగోపాల్, సిద్దయ్య, వెంకట్రమణ, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఆదరణ మరచిపోలేనిది

వాల్మీకిపురం, ఏప్రిల్ 27: వాల్మీకిపురంలో తమ ప్రచారానికి లభిస్తున్న ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేనిదని టీడీపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వాల్మీకిపురం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ఎంపీగా కిరణ్‌కుమార్ రెడ్డిని, ఎమ్మెల్యేగా కిశోర్‌కుమార్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శనివారం తనూజ రెడ్డితోపాటు ఆమె కుమార్తె డాక్టర్ వైష్ణవి, కోడలు డాక్టర్ షమారెడ్డి, సౌమ్య రెడ్డి టీడీపీ, బీజేపీ కరపత్రాలతో ఓటర్లను కలిశారు. ప్రచారంలో మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, వెంకట్రమణ, సయ్యద్ బాషా, మధు, కృష్ణారెడ్డి, నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, కోనూరి రమేష్, సురేంద్ర వర్మ, వల్లిగట్ల వెంక ట్రమణ, సుధాకర్ రెడ్డి, మురళి, బొక్కసం బ్రదర్స్ కువైట్ బాబు, హనీఫ్, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, ఆదినారాయణ, రాజగోపాల్ పాల్గొన్నారు.